ప్రజాశక్తి

శుక్రవారం 1 డిసెంబరు 2023 | 8 పేజీలు | ఎన్‌టిఆర్ | కృష్ణా







జెండా ఊపి డిజిటల్ వాహనాన్ని ప్రారంభిస్తున్న గవర్నర్ అబ్దుల్ నజీర్

డిజిటల్ ప్రచార వాహనం ప్రారంభం

పచ్చ జెండా ఊపిన గవర్నర్ అబ్దుల్ నజీర్

వికసిత్ భారత్ సంకల్పయాత్రకు రూట్‌మ్యాప్ రూపకల్పన : కలెక్టర్

ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి : వికసిత్ భారత్ సంకల్పయాత్ర డిజిటల్ ప్రచార వాహనాన్ని గురువారం రాష్ట్ర గవర్నర్ జస్టిస్ యస్.అబ్దుల్ నజీర్ పచ్చ జెండా ఊపి ప్రారంభించారు. మచిలీపట్నం మండలం సుల్తాన్నగరంలో మచిలీపట్నం - విజయవాడ జాతీయ రహదారి పక్కన ఉన్న సుమ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంబంధిత శాఖలు ఏర్పాటు చేసిన ప్రదర్శనశాలలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా కలెక్టర్ పి.రాజాబాబు మాట్లాడుతూ వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించామని తెలిపారు. నవంబర్ 25 నుండి జనవరి 26వ తేదీ వరకు జిల్లాలోని 491 గ్రామాల్లో 60 రోజుల్లో మచిలీపట్నం, గుడివాడ, పెడన వైయస్సార్ తాడిగడప, ఉయ్యూరులో మొత్తం 11 ప్రదేశాల్లో వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహణకు జిల్లాకు కేటాయించిన 5 ప్రచార వాహనాల ద్వారా షెడ్యూలు రూట్ మ్యాప్ రూపొందించామన్నారు. (మిగతా 6లో)

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

కండిషన్లోలేని బస్సుల్లో పిల్లల తరలింపులు

ఫిట్‌నెస్ సర్టిఫికెట్లపై రవాణా శాఖ నిర్లక్ష్యం

ఎన్‌టిఆర్ జిల్లాలో 450కిపైగా ఎఫ్‌సి లేని బస్సులు

అత్యధికంగా నందిగామ పరిధిలో వాహనాలు





ఇటీవల జగ్గయ్యపేటలో శ్రీ చైతన్య పాఠశాల బస్సులో మంటలు చెలరేగిన దృశ్యం (పాతది)

ప్రజాశక్తి - విజయవాడ ప్రతినిధి

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ల (ఎఫ్‌సి)పై ఒకవైపు రవాణా శాఖ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండగా, మరోవైపు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు యథేచ్ఛగా ఎఫ్‌సిలేని వాహనాలను రోడ్లపై తిప్పుతున్నాయి. ఎఫ్‌సితోపాటు ఇతర ధృవీకరణ పత్రాలను ప్రతి ఏటా రెన్యువల్ చేసుకోవాడంలోనూ పలు విద్యా సంస్థలు నిర్లక్షంగానే వ్యవహరిస్తున్నాయి. దీంతో బస్సుల్లో ప్రయాణించే విద్యార్థులకు భద్రత కరువవుతోంది. ఎన్‌టిఆర్ జిల్లావ్యాప్తంగా ఈ సమస్య నెలకొంది. ఇలాంటి బస్సులు నందిగామ ఆర్‌టిఎ పరిధిలో అధికంగా ఉన్నాయి. 2023-24 విద్యా సంవత్సరం ప్రారంభమై ఐదు నెలలు గడుస్తున్నా పలు విద్యా సంస్థలు సుమారు 450 బస్సులకు ఇంత వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోలేదంటే విద్యార్థుల ప్రాణాల పట్ల ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయో అర్థమవుతుంది. ప్రమాదాలు జరుగుతాయని హెచ్చరికలు జారీచేస్తున్నా ఆ సంస్థలు బేఖాతరు చేస్తున్నాయి. రోడ్డు ట్రాన్స్ పోర్టు అథారిటీ (ఆర్‌టిఎ) విజయవాడ కార్యాలయం పరిధిలో మొత్తం 1273 వివిధ విద్యా సంస్థల బస్సులున్నాయి. వీటిలో 1116 బస్సులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోగా, 157 బస్సులకు ఇంత వరకు తీసుకోలేదు. నందిగామ ఆర్‌టిఎ కార్యాలయ పరిధిలో 285 స్కూల్ బస్సులున్నాయి. వీటిలో 25 వాహనాలు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోగా మరో 260 బస్సులకు ఎఫ్‌సిలు తీసుకోవాల్సి ఉంది. అంటే ఈ రెండు కార్యాలయాల పరిధిలో సుమారు 417 బస్సులు ఇంత వరకు ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు తీసుకోలేదు. జగ్గయ్యపేటలోని యూనిట్ రవాణా కార్యాలయం పరిధిలో మొత్తం 60 బస్సులుండే వీటిలో 38 బస్సులకు ఎఫ్‌సిలు తీసుకోగా, మరో 32 బస్సులు తీసుకోవాల్సి ఉంది. విద్యా సంవత్సరం ప్రారంభానికి ముందే ప్రతి ఏటా బస్సుల కండిషన్ చెక్ చేసుకోవాల్సి ఉంది. అనంతరం ఆయా ఆర్‌టిఎ కార్యాలయాల నుంచి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు పొందాల్సి ఉంది. వీటితోపాటు మోటారు వాహన చట్టం ప్రకారం వాహనం రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్, ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్, పర్మిట్, పన్నుల చెల్లింపు రసీదు, పొల్యూషన్ అండ్ కంట్రోల్ సర్టిఫికెట్, డ్రైవర్ లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలి. ప్రతి ఏటా వీటిని రెన్యువల్ చేయించుకోవాల్సి ఉంటుంది. చట్టం ప్రకారం ప్రతి బస్సులో అత్యవసర ద్వారాలు, ఫస్ట్ ఎయిడ్ కిట్ బాక్స్, సైడ్ మిర్రర్లు కలిగి ఉండాలి. నిబంధనల మేరకు ఫుట్ స్టెప్స్, ఫైర్ డిటెక్షన్ అలారమ్ సిస్టమ్, అనువైన సీటింగ్ ఏర్పాట్లు కలిగి ఉండాలి. అన్నింటికి మించి ఇంజన్ కండిషన్లో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి. బ్రేకులు పడుతున్నాయా లేదో చెక్ చేసుకోవాలి. ఇవన్నీ సక్రమంగా ఉన్నప్పుడే ఆర్‌టిఎ అధికారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ మంజూరు చేస్తారు. కానీ ఈ నిబంధనలను పలు విద్యా సంస్థల యాజమాన్యాలు పాటించడం లేదు. ఖర్చు ఎక్కువవుతుందన్న ఉద్దేశంలో యాజమాన్యాలు దృష్టి సారించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి.

పత్తి కొనుగోళ్లు ప్రారంభం


ప్రజాశక్తి కథనానికి స్పందించిన సిసిఐ

కొనుగోళ్లను పరిశీలించిన మార్కెటింగ్ జెడి

ప్రజాశక్తి-కంచికచర్ల: కంచికచర్ల మార్కెట్ యార్డులో ఎట్టకేలకు సిసిఐ పత్తి కొనుగోలు ప్రారంభమయ్యాయి. నెల రోజుల క్రితం నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్‌రావు పత్తి కొనుగోళ్లు ప్రారంభించినా, ట్రాన్స్పోర్ట్ ఖరారు కాలేదని సాకుతో సిసిఐ, మరియు మార్కెటింగ్ శాఖ సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా బుధవారం వరకు కిలో పత్తి కూడా కొనలేదు. దీంతో రైతులు అవసరాలను దృష్టిలో ఉంచుకుని ప్రైవేటు వ్యాపారులు గ్రామాల్లో తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. దీనివల్ల మద్దతు ధర లభించక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. దీనిపై 'పత్తి ధరలు పతనం' 'సిసిఐ కొనుగోళ్లు నిల్' శీర్షికతో గురువారం ప్రజాశక్తిలో కథనం వెలువడింది. దీంతో మార్కెటింగ్ శాఖ, సిసిఐ ఉన్నతాధికారలు స్పందించారు. వెంటనే కంచికచర్ల మార్కెట్ యార్డులో సిసిఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభించాలని స్థానిక అధికారులను ఆదేశించారు. దీంతో గురువారం కంచికచర్ల యార్డు కు రైతులు తీసుకువచ్చిన పత్తి బోరాలను సిసిఐ అధికారులు ప్రాసింగ్ నిర్వహించారు. మార్కెటింగ్ శాఖ విజయవాడ జాయింట్ డైరెక్టర్ కె శ్రీనివాసరావు కంచికచర్ల మార్కెట్ యార్డుకు వచ్చి సిసిఐ పత్తి కొనుగోళ్ళు పరిశీలించారు. సిసిఐ కేంద్రాలకు రైతులు తీసుకు వచ్చిన పత్తిని త్వరితగతిన పాసింగ్ నిర్వహించాలని సిబ్బంది ని ఆదేశించారు. రైతులు పత్తి పంటను సిసిఐ లో అమ్మకోవాలంటే ముందుగా ఆయా గ్రామాల్లో ఆర్బికె లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. కేంద్ర ప్రభుత్వం పత్తికి మద్దతు ధర క్వింటాళ్లకు 7020 ప్రకటించిందని, నాణ్యమైన పత్తిని సిసిఐ కేంద్రాల్లో అమ్ముకొని మద్దతు ధర పొందాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు కార్యదర్శి కె శ్రీనివాస్, సిసిఐ బయ్యర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

380 పత్తి బోరాలు కొనుగోలు

కంచికచర్ల మార్కెట్ యార్డులో గురువారం 15 మంది రైతులు తీసుకువచ్చిన 380 పత్తి బోరాలను సిసిఐ బయ్యర్ పాసింగ్ జరిపి, కొనుగోలు చేసినట్లు యార్డు కార్యదర్శి కె శ్రీనివాస్ తెలిపారు. కొనుగోలు చేసిన పత్తి క్వింటాకు అత్యధిక ధర 7,020, అత్యల్ప ధర 6,664 లభించినట్లు తెలిపారు. క్వింటా ఒకటికి సగటు ధర 6,945 లభించినట్లు తెలిపారు.



కంచికచర్ల మార్కెట్ యార్డులో సిసిఐ పత్తి కొనుగోళ్లను పరిశీలిస్తున్న మార్కెటింగ్ జెడి

ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ చట్టం అమలుపై ఫిర్యాదులకు ప్రత్యేక పోర్టల్


ప్రజాశక్తి - విజయవాడ : దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సీ, ఎస్‌టీ (ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్) చట్టం అమలుకు సంబంధించి ఫిర్యాదు చేసేందుకు వీలుగా ప్రత్యేక పోర్టల్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. https://poa.apcfss.in ద్వారా బాధితులు ఎవరైనా ఎక్కడినుంచైనా ఫిర్యాదు చేయొచ్చని ఆయన పేర్కొన్నారు. ఏపీసీఎఫ్ఎస్ఎస్ అభివద్ధి చేసిన ఈ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

ఘనంగా గురజాడ వర్థంతి

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్: పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల తెలుగు విభాగం ఆధ్వర్యంలో మహాకవి గురజాడ వెంకట అప్పారావు 108వ వర్ధంతి కార్యక్రమాన్ని కళాశాల మైదానంలో సంప్రదాయ బద్ధంగా నిర్వహించినట్లు డాక్టర్ మేకా రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా కళాశాల విద్యార్థిని విద్యార్థులు ఎన్సీసీ క్యాడెట్లు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు, భారతదేశ చిత్రపట ఆకారంలో త్రివర్ణ టోపీలు ధరించి మహాకవి గురజాడ వారికి నివాళులు అర్పించారు. గురజాడ అప్పారావు జీవిత విశేషాలను సంక్షిప్త పరిచయం ద్వారా తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎన్. శివకుమార్ విద్యార్థినీ విద్యార్థులకు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు ముఖ్యఅతిథిగా విచ్చేసి జాతీయ పతాక ఆవిష్కరణ గావించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రాచార్యులు డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ ప్రొఫెసర్ రాజేష్ జంపాల, తెలుగు అధ్యాపకులు డాక్టర్ పి నీరజ, డాక్టర్ మస్తాన్‌రావు, డాక్టర్ ఏవి రమణమూర్తి పాల్గొన్నారు.

విజయవాడ: గురజాడ అప్పారావు 108వ వర్ధంతి ఐద్వా సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం పలు ప్రాంతాల్లో జరిగింది. స్థానిక ప్రకాష్ నగర్ లోని మోటూరి హనుమంతరావు శ్రామిక భవన్‌లో, అలాగే దుర్గాపురంలోని నండూరి. ప్రసాద రావు శ్రామిక భవన్ లోనూ గురజాడ వర్ధంతి కార్యక్రమాలు జరిగాయి. ముందుగా ఆయన చిత్రపటానికి ఐద్వా నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఐద్వా సెంట్రల్ సిటీ అధ్యక్ష కార్యదర్శులైన కె.సరోజ, జి.ఝాన్సీ మాట్లాడుతూ నేటి ప్రభుత్వాలు మహిళా సాధికారిత దిశగా వెళ్లాలని, అప్పుడే గురజాడకు అర్పించే నిజమైన నివాళి అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ సిటీ సహాయ కార్యదర్శి ఆషా, జమలమ్మ, విజయలక్ష్మి, దుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నం: జనవిజ్ఞాన వేదిక కొండపల్లి శాఖ ఆధ్వర్యంలో అభ్యుదయ కవి గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం గురువారం జరిగింది. ఈ కార్యక్రమానికి సభా అధ్యక్షులుగా నాగార్జున ఇంగ్లీష్ మీడియం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, జెవివి కొండపల్లి శాఖ కార్యదర్శి సర్దార్ సాహెబ్ వ్యవహరించారు. ముఖ్య అతిథులుగా జిల్లా ఉపాధ్యక్షులు పెట్ల కామేశ్వరరావు హాజరయ్యారు. ముందుగా గురజాడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జెవివి కొండపల్లి శాఖ అధ్యక్షులు ఎస్ నాగరాజు, కోశాధికారి చేతన్ మురళీ పాల్గొన్నారు.



పిబి సిద్ధార్థలో...



ఐద్వా ఆధ్వర్యంలో...



కొండపల్లిలో...

నేటి నుండి మెయిన్ డ్రా పోటీలు

ప్రజాశక్తి-విజయవాడఅర్బన్: నగరంలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న జాతీయ స్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలలో భాగంగా శుక్రవారం నుండి మెయిన్ డ్రా పోటీలు జరుగనున్నాయి. క్వాలిఫైయింగ్ రౌండ్ పోటీలు గురువారం నాటితో ముగిశాయి. శుక్రవారం నుండి జరిగే పోటీలలో ప్రధానమైన క్రీడాకారులు పాల్గొననున్నారు. ఆంధ్రప్రదేశ్ నుండి ప్రాతినిధ్యం వహించిన విజయవాడ ఐజిఎంసి క్రీడాకారిణి ఆర్.కాజల్ సునార్ మెయిన్‌డ్రా పోటీలకు అర్హత సాధించింది. గురువారం జరిగిన క్వాలిఫైయింగ్ పోటీలలో సాగరిక ముఖర్జీపై కాజల్ సునార్ 2-1 తేడాతో విజయం సాధించి కాజల్ మెయిన్స్‌కు అర్హత సాధించింది. శుక్రవారం అండర్-17, అండర్-19 విభాగంలో ఉమెన్స్ సింగిల్స్, మెన్స్ సింగిల్స్ ఫైనల్స్ పోటీలు జరుగనున్నాయి.



7,875 కేసులు పరిష్కారం : సిపి

ప్రజాశక్తి-విజయవాడ: 2019-22 ఏడాదిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న 8,303 కేసులు నమోదు చేసి 7,875 కేసులు కోర్టులో పరిష్కరించినట్లు నగర పోలీస కమిషనర్ కాంతిరాణాటాటా తెలిపారు. ఈమేరకు ఆయన గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...నమోదు అయిన కేసుల్లో 1025 మంది జైలు శిక్ష, రు.2,02,57,900 జరిమాన విధించారు. అలాగే ఈ సంవత్సర జనవరి నుంచి ఇప్పటి వరకు 1642 కేసులు నమోదు చేసి 1292 కేసులలో కోర్టు పరిష్కరించారు. ఇప్పటి వరకు 406 మందికి జైలు శిక్ష, 886 మందికి రు. 1,31,53,000 జరిమానా విధించారు. ఈ జరిమానాలలో కొంత మందికి రు.10,000, మరికొంత మందికి రు. 15,000 జరిమానా విదించారు. జరిగినది.గడిచిన 10 రోజుల నుండి మోటార్ వాహన చట్టముల ఉల్లంగనలపై ప్రత్యేక దష్టి పెట్టి వారికి రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పించడ మైనది. ఇందులో భాగంగా సెల్ ఫోన్ లో మాట్లాడుతూ వాహనములు నడుపు 112 మందికి, వన్ వే అతిక్రమించినవాహనదారులు 54 మందికి, ట్రిపుల్ రైడింగ్ చేసిన వాహనదారులు 254 మందికి, హెల్మెట్ ధరించని వాహనదారులు 752 మరియు ఇతర యం.వి. యాక్ట్ ఉల్లంగన చేసిన 6 వ్యక్తులకు మొత్తంగా 1689 మందికి మోటార్ వెహికల్ యాక్ట్ పై అవగాహన కల్పించారు.

58వ డివిజన్‌లో విష్ణు పర్యటన

ప్రజాశక్తి-విజయవాడ: స్థానిక సింగ్‌నగర్ 58 వ డివిజన్‌లో నగర డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డితో కలిసి గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఎమ్మెల్యే మల్లాది విష్ణు నిర్వహించారు. నందమూరినగర్లోని 1, 2, 3 , 4 వ లైన్లలో విస్తృతంగా పర్యటించారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఇంజినీర్ ఎం ప్రభాకర్ రావు, ఈఈ శ్రీనివాస్, ఏఎంఓహెచ్ రామకోటేశ్వరరావు, నాయకులు అవుతు శ్రీనివాసరెడ్డి, అఫ్రోజ్, తోపుల వరలక్ష్మి పాల్గొన్నారు.

స్థానిక 31వ డివిజన్‌లోని ముత్యాలంపాడులో గురువారం 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజారెడ్డి, స్థానిక కార్పొరేటర్ పెనుమత్స శిరీష సత్యంతో కలిసి ఎమ్మెల్యే మల్లాది విష్ణు పాల్గొన్నారు. తొలుత వైఎస్ రాజశేఖరరెడ్డి చిత్రపటానికి ఘన నివాళులు అర్పించి, పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం సచివాలయం వద్ద సంక్షేమాభివద్ధి కార్యక్రమాల బోర్డును ఆవిష్కరించారు. రాష్ట్రంలో అభివద్ధి, సంక్షేమాన్ని సమపాళ్లలో ముందుకు తీసుకువెళ్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఈ సందర్భంగా మల్లాది విష్ణు అన్నారు. పల్లెల్లో 92 శాతం మంది ప్రజలకు, పట్టణాలలో అయితే 87 శాతం మందికి ఏదో ఒక పథకం ద్వారా లబ్ధి చేకూర్చిన ప్రభుత్వం వైసిపి అని అన్నారు. కార్యక్రమంలో నాయకులు టి.మురళీకష్ణంరాజు, కంభం కొండలరావు పాల్గొన్నారు.



బుక్‌లెట్‌లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మల్లాది విష్ణు

ఇసుక అక్రమ తరలింపు వాహనాలు అడ్డగింత



ఇసుక వాహనాలను అడ్డుకుంటున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి-కంచికచర్ల: చెవిటికల్లు నాలుగు రోడ్ల జంక్షన్ వద్ద గురువారం రాత్రి అనుమతులు లేకుండా రవాణా చేస్తున్న ఇసుక లారీలను టిడిపి, జనసేన ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అడ్డుకున్నారు. ఏడు ఇసుక లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించాలంటూ రోడ్డుపైనే లారీలను నిలిపి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు ఈ ఇసుక అక్రమ రవాణాకు మాకు ఏమి సంబంధం లేదు అంటూ నీతి వాక్యాలు పలుకుతారని ఆరోపించారు. ఇసుక అక్రమ రవాణా గురించి అధికారులకు ఫోన్ చేస్తే కనీసం ఫోన్ ఎత్తి సమాధానం చెప్పే పరిస్థితిలో లేరని విమర్శించారు. పరిమితికి మించి అధిక లోడుతో ఇసుక అక్రమంగా లారీల్లో రవాణా వల్ల రోడ్లు మొత్తం పూర్తిగా ధ్వంసమైపోయి పెద్ద పెద్ద గుంటలు ఏర్పడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. నియోజకవర్గంలో కొండలు కరిగిపోయి లోయలు ఏర్పడ్డాయని, మున్నలూరు, మొగులూరు,కీసర పరిధిలో కృష్ణా నది, మున్నేరులో ఏ మేరకు ఇసుక గుంటలు ఏర్పడ్డాయో చూపిస్తామన్నారు. ఇసుక రవాణా చేస్తున్న ఏ ఒక్క లారీకి కూడా అనుమతుల పత్రాలు లేవని, వాళ్ల చూపించే జేపీ సంస్థ అనుమతుల కాగితాలు మే నెలతోనే గడువు ముగిసిపోయిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు కోగంటి బాబు, ఎంపిటిసి వెంపరాల వెంకటేశ్వరరావు, అబ్బూరి నాగమల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆందోళనకారులతో పోలీసులు వాగ్వాదం

మున్నలూరు ఇసుక రీచ్ నుండి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న లారీలను చెవిటికల్లు వద్ద టిడిపి నేతలు నిలిపివేయడంతో రంగ ప్రవేశం చేసిన పోలీసులు ఆందోళనకారులపై వాగ్వాదానికి దిగారు. నందిగామ రూరల్ సిఐ ఐవి నాగేంద్ర కుమార్, ఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి చెవిటికల్లు నాలుగు రోడ్ల జంక్షన్ వద్దకు చేరుకున్నారు. ఇసుక లారీలను నిలిపి వేసి ఆందోళనకు దిగిన మాజీ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఇతర నేతలకు సిఐ సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. రోడ్డు పై లారీలు నిలిపి వేయటం వల్ల ట్రాఫిక్ అంతరాయం ఏర్పడి శాంతిభద్రతలు తలెత్తుతాయని సిఐ చెప్పారు.

హెచ్‌ఐవి బాధితులకు అండగా ఉంటాం

ఎపి శాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్ రాజేంద్రకుమార్



ప్రజాశక్తి-హెల్త్ యూనివర్సిటీ: హెచ్‌ఐవి బాధితులు అవసరమైన విద్య, నివాసం వంటి అంశాలలో సాయం కోసం ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణా సంస్థ (ఎపి శాక్స్) ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ బి రాజేంద్రకుమార్ లఘింశెట్టి ఉద్ఘాటించారు. డిసెంబర్ 1వ తేదీ ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవ సందర్భంగా ఎపి శాక్స్ ఆధ్వర్యంలో గురువారం విజయవాడ ఐఎంఎ హాల్లో నిర్వహించిన 'సామూహిక అల్పాహార విందు' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాధిత రోగుల పిల్లల జీవిత లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. హెచ్‌ఐవి బాధిత రోగులు, వైరస్ సోకిన వారి పిల్లలు ఈకార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొని గీత నృత్యాలతో ఆహూతులను అలరించారు. వీరందరికీ దాతల సహకారంతో స్కూల్ కిట్లను బహుమతులుగా అందచేశారు. ఈ సందర్భంగా పిల్లలకు పెయింటింగ్, డ్రాయింగ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందచేశారు. ఎపి శాక్స్ ఎపిడి డాక్టర్ కె కోటేశ్వరి, ఎపి శాక్స్ ఎస్టిఐ, ఇసి డాక్టర్ టి మంజుల ఆహూతులకు స్వాగతం పలికిన ఈ కార్యక్రమంలో ఇంకా ఎన్టిఆర్ జిల్లా డిఎంహెచ్ఓ డాక్టర్ సుహాసిని, డిఎల్ఎటిఓ హెచ్ఓ, క్రిష్ణా జిల్లా డిఎసిఓ డాక్టర్ జె ఉషారాణి, ఎన్టిఆర్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ ఛైర్మన్ డాక్టర్ జి సమరం, ఎపి శాక్స్ నుండి బిఎస్డి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కామేశ్వర ప్రసాద్, సిఎస్టి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, పెప్ఫార్ సమన్వయకర్త డాక్టర్ రాజేంద్ర ప్రసాద్, టిఎన్పి కుమారి రేణుక పాల్గొన్నారు. అల్పాహార విందు సమయంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న హెచ్‌ఐవి బాధితులు తమ అనుభవాలను ఎపిశాక్స్ ప్రాజెక్ట్ డైరెక్టర్‌తో పంచుకున్నారు.

'దోమల నివారణకు చర్యలు తీసుకోవాలి'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: మండలంలోని షేర్ మహమ్మద్‌పేట గ్రామం లో దోమల బెడదతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇళ్ల దగ్గర ఉన్న మురుగు కాల్వలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదనీ, బ్లీచింగ్ చల్లట్లేదని దీంతో దోమల విపరీతంగా పెరిగిపోయాయని దోమల సమస్యను వెంటనే పరిష్కరించాలని బహుజన సమాజ్ పార్టీ నియోజకవర్గ అధ్యక్షుడు అన్నెపాగ పవన్‌కార్తీక్ కోరారు. గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శికి గురువారం వినతి పత్రం అందజేశారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించిన రాజ్‌కుమార్

ప్రజాశక్తి-విజయవాడ

సర్కిల్-3లో అసిస్టెంట్ కమిషనర్‌గా పని చేస్తున్న యమ్, రాజకుమార్, జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగదుర్గ గురువారం స్వచ్ఛంద పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా ఎపి మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పదవీ విరమణ వీడ్కోలు కార్యక్రమం జరిగింది. గత 40 సంవత్సరాల కాలంలో వివిధ స్థాయిల్లో విధులు నిర్వహించిన రాజ్‌కుమార్ చేసిన సేవలను వివిధ విభాగాల అధికారులు గుర్తు చేశారు. డిప్యూటీ కమీషనర్ -రెవెన్యూ డి. వెంకట లక్ష్మిః, జోనల్ కమీషనర్ యమ్.కృష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు తదితరులు పాల్గొని మాట్లాడారు. సదరు కార్యక్రమనకు అసోసియేషన్ సభ్యులు టి. నాగేశ్వరావు, జి.ప్రకాష్ సాగర్, బి. ఉదయ్ భాస్కర్, పి.మధుసూధనరావు, మారుతీరావు, శ్యాంసురేంద్రబాబు,బిల్ కలెక్టర్స్, రెవిన్యూ ఇన్స్పెక్టర్స్, ఇండోర్ సిబ్బంది, సచివాలయ సెక్రటరీలు పాల్గొన్నారు. వేర్వేరుగా జరిగిన ఈ కార్యక్రమాల్లో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ కె వి సత్యవతి తదితరులు పాల్గొన్నారు.





సచివాలయంలో తనిఖీలు నిర్వహిస్తున్న మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

14 మంది సచివాలయ సిబ్బందికి నోటీసులు

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ పరిధిలోని వివిధ వార్డు సచివాలయాల యందు మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ తనిఖీలు గురువారం నిర్వహించారు. దీనిలో భాగంగా ఆస్తి పన్ను, యూజర్ చార్జీలు కలెక్షన్స్ తక్కువ చేసిన 9 మంది అడ్మిన్ సెక్రటరీలకి చార్జి మెమోస్, 5 మంది శానిటేషన్ సెక్రటరీలకి షోకాజ్ నోటీసులు ఇవ్వడం జరిగినట్లు కమిషనర్ తెలిపారు.

సాయి కళ్యాణి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్: తెలుగు మహిళ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మూల్పూరు సాయి కల్యాణి పుట్టిన రోజు సందర్భంగా బుధవారం బాపులపాడు మండలం రేమల్లె, హనుమాన్ జంక్షన్ లో అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో నిర్వహించిన పూజా కార్యక్ మంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి స్వాములకు స్వయంగా భిక్షను కల్యాణి వడ్డించారు. గన్నవరం నియోజకవర్గ టీడీపీ ఇంచార్జి యార్లగడ్డ వెంకట్రావు ఆధ్వర్యంలో నూతన టీడీపీ కార్యాలయంలో సాయి కళ్యాణి జన్మదిన వేడుకలను టీడీపీ నాయకులు తెలుగు మహిళలు ఘనంగా నిర్వహించారు. తెలుగు మహిళల అధ్వర్యంలో ఏర్పాటు చేసిన కేక్ ని కళ్యాణ్ కట్ చేశారు. ఈ సందర్భంగా యార్లగడ్డ దంపతులు శ్రీ వెంకటేశ్వర స్వామి వారి చిత్రపటాన్ని సాయి కళ్యాణికి అందజేశారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దొంతు చిన్నా, తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోనేరు నాని, తెలు గు మహిళ జిల్లా అధ్యక్షురాలు వడ్డీల్లి లక్ష్మీ, పాల్గొన్నారు.



కంకిపాడులో 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ'

ప్రజాశక్తి-కంకిపాడు : స్థానిక టిడిపి నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమం కంకిపాడులోని 175వ బూత్‌లో బుధవారం జరిగింది. ఈ కార్యక్రమంలో బూత్ కన్వీనర్ ఏనుగ జయ ప్రకాష్, కొండా నాగేశ్వరరావు, గోగినేని వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష బిల్వార్చన

ప్రజాశక్తి-మోపిదేవి : కార్తీక మాసం ఆరుద్ర నక్షత్రం సందర్భంగా మోపిదేవి మండలం పెద్దకళ్లేపల్లి గ్రామంలో వేరుగాంచిన శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగే శ్వర స్వామికి గురువారం లక్ష బిల్వార్చన మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. బిల్వపత్రాలతో నానా విధ ఫల పుష్పాలతో స్వామివారి అలంకారం భక్తులకు నయన మనోహరంగా కనువిందు చేసింది. పెద్దకల్లేపల్లిలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. ఆలయ కార్య నిర్వహణ అధికారి నల్లం సూర్య చక్రధర రావు పర్యవేక్షణలో వేద పండితులు లక్ష బిల్వార్చన కార్యక్రమాన్ని వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. దక్షిణ కాశీగా పిలవబడుతూ కృష్ణా తీరంలో ప్రసిద్ధి గాంచిన పెదకళ్ళేపల్లి శివనామస్మరణతో మార్మోగుతోంది.

బస్సు యాత్ర కాదు.. అణచివేత యాత్ర : కొల్లు

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : చేసిన పనులు చెప్పుకోకుండా జగన్ భజనే లక్ష్యంగా చేపడుతున్న వైసీపీ సామాజిక బస్సు యాత్ర కాదని సామాజిక అణచి వేత యాత్ర అని మాజీ మంత్రి టిడిపి పోలిట్ బ్యూరో సభ్యుడు కొల్లు రవీంద్ర విమర్శించారు. గురువారం స్థానిక నియోజక వర్గ కార్యాలయంలో నిర్వహించిన విలేఖర్ల సమావేశంలో కొల్లు రవీంద్ర మాట్లాడుతూ మచిలీపట్టణంలో వైసీపీ చేసిన సామజిక బస్సు యాత్రను బీసీలను మళ్లీ మళ్లీ మోసం చేసే యాత్ర అని ఎద్దేవా చేసారు. బస్సు యాత్రలో వైసీపీ బీసీ ఎస్సీ మైనారిటీ నాయకులను పేర్ని నాని తీవ్రంగా అవమానించారన్నారు. కనీసం వారిని పట్టించుకోకుండా అంటి ముట్టనట్లు వ్యవహరించారన్నారు. దీనిని బట్టే బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీల పరిస్థితి ఎలావుందో ఆయ వర్గాల ప్రజలు అర్ధం చేసుకోవాలన్నారు. బీసీ ఎస్సీ మైనారిటీ నాయకులను అవమానించిన పేర్ని నాని కొడుకును ప్రమోట్ చేసుకునే యాత్రగా పేర్ని నాని వాడుకున్నాడు తప్ప పేదలకు ఒరిగింది ఏమి లేదన్నారు. డబ్బులు వసూలు చేసి ఫ్లెక్సీలు కట్టించుకొని డ్వాక్రా మహిళలను బెదిరించి పెన్షన్ పథకాలు పీకేస్తాం అని సభకు మనసులు తెచ్చుకునే పరిస్థితి అందుకే అది సామాజిక యాత్ర కాదు సామాజిక అణచివేత యాత్ర అని ఆరోపించారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీటీసీ లంకె నారాయణ ప్రసాద్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ గోపు సత్యనారాయణ, పట్టన అధ్యక్షులు ఇలియాస్ పాషా పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొల్లు రవీంద్ర

ఉపాధ్యాయులకు శిక్షణ

ప్రజాశక్తి -మొవ్వ : మొవ్వ మండలంలోని కూచిపూడి శ్రీ సిద్దేంద్ర జిల్లా పరిషత్ ఓరియంటల్ హైస్కూల్లో ప్రాథమిక స్థాయిలో ఒకరోజు శిక్షణా తరగతులు నిర్వహించారు. ఈ శిక్షణ తరగతులకు ముఖ్య అతిథిగా హాజరైన కూచిపూడి స్కూల్ చైర్మన్గా ఉన్నజన్నార్థి ప్రధానోపాధ్యాయులు గుంటూరు వెంకట సత్య ప్రసాద్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకొని విద్యార్థులకు సులభరీతిలో బోధించాలని సూచించారు. ఇటీవల నిర్వహించిన సమ్మేట్-1 పరీక్షలలో పాల్గొన్న విద్యార్థుల మార్కుల గ్రేడులను పరిశీలించి సి,డి గ్రేడుల పిల్లల పట్ల మరింత శ్రద్ధ వహించి ఏ,బిగ్రేడ్ లస్థాయికి ఎదిగేందుకు కృషి సల్పాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా మండలంలోని 21 గ్రామాల నుంచి హాజరైన 38 మంది ఉపాధ్యాయులు తెలుగు, ఇంగ్లీషు, లెక్కలు, పరిసరాల విజ్ఞానంఅంశాలలో గ్రూప్ డిస్కషన్స్ నిర్వహించారు. ఆదేవిధంగా ఉపాధ్యాయులు రివ్యూలు నిర్వహించి సహచర ఉపాధ్యాయులతో తన అనుభవాలను పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యా యులు పాగోలు రమేష్ బాబు, కూచిపూడి స్కూల్ కాంప్లెక్స్ కార్యదర్శి లంకపల్లి శ్రీనివాసరావు, సిఆర్పి తాతాసమర్పణ రావు పలు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు : తహశీల్దార్

ప్రజాశక్తి-ఉంగుటూరు : ఉంగుటూరుబి యువతరం ఓట్లు ప్రగతికి మెట్లు అని తహసీల్దార్ దోనవల్లి వనజాక్షి అన్నారు. మండలంలోని తేలప్రోలు గ్రామ పరిధిలో ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థిని విద్యార్థులతో భారత ఎన్నికల సంఘం ఆదేశానుసారం (%హాఎజఞాౌ%) ఓటర్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 18 సంవత్సరములు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓట్లు నమోదు చేసుకోవాలని, 17 సంవత్సరములు నిండిన వారు ప్రొస్పెక్ట్ వి ఓటరుగా నమోదు చేసుకోవచ్చని అన్నారు. యువతరం ఓటు ద్వారా మెరుగైన అభివద్ధి జరుగుతుందని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉషారామా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీ విద్యార్థులకు ఆన్లైన్లో ఓటు నమోదు ప్రక్రియ గురించి డిజిటల్ స్క్రీన్ పై వివరాలు తెలియజేశారు. అనంతరం విద్యార్థినీ, విద్యార్థులు, మండల రెవెన్యూ సిబ్బంది కలిసి ఓటు హక్కు అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ పి. శ్రీలత, ఉషారామ ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ జీవీకే ఎస్వీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



ఓటు హక్కుపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

క్రీడా వస్తువులు అందజేత

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల లోని క్రీడాకారులకు రెండవ సెగ్మెంట్ ఎంపీటీసీ సభ్యురాలు గొ ళ్ళ కృష్ణకుమారి రూ 5 వేల విలువచేసే ఆట వస్తువులను అందజేశారు. ఆమనగడ్డ సబ్ జోన్ వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షులు కోసూరు పూర్ణచం ద్రావుకు గురువారం ఆట వస్తువు లను పూర్ణచంద్రరావు ద్వారా పాఠశాల ప్రధానోపాధ్యా యులు జిఎన్‌వి గోపాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పీడీలు ఎస్ శ్రీకాంత్, ఏ భాను ప్రకాష్, పాల్గొనగా ఎంపిటిసి సభ్యురాలు కృష్ణకుమారికి ధన్యవాదాలు తెలిపారు.



ఘనంగా సిఆర్ దాస్ జయంతి

ప్రజాశక్తి - గుడివాడ : సాహితీవేత్త సిఆర్ దాస్ జయంతి కార్యక్రమాన్ని సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో స్థానిక గులాబ్ చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు సిఆర్ దాసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు సాహితీవేత్తలు మాట్లాడుతూ ఆదర్శనీయులైన సిఆర్ దాసును ఆదర్శంగా తీసుకొని యువతకు సాహిత్యం పై అవగాహన కల్పించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రా హ్మణ ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు చింతలూరు సత్యనారాయణ, విజయలక్ష్మి, రూప, వంగవరపు వీర రాఘవాచారి, సత్యనారాయణ బాబు, వంశీ, సాయిన శ్రీ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న డిఎస్‌పి జయసూర్య

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్ట్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం ప్రాంతంలో గంజాయి తాగడంతో పాటు విక్రయిస్తున్న ఐదుగురు యువకులను అరెస్టు చేసినట్లు డి.ఎస్.పి జయసూర్య తెలిపారు. గురువారం గన్నవరం పోలీస్ స్టేషన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గంజాయి విక్రయిస్తున్న వారిని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉంగుటూరు మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన తమ్మిన విజయ్ చౌదరి, గన్నవరం మండలం రాజు కాలనీకి చెందిన కటారి నరేష్, , తేలప్రోలు కు చెందిన కటారి నవీన్, గన్నవరం దళితవాడకు చెందిన రాచేటి శ్యాం ప్రసాద్, విజయవాడ రూరల్ మండలం కండ్రిక కు చెందిన తోట యతీష్ లు గంజాయి విక్రయం చడం వత్తిగా చేసుకున్నారని తెలిపారు. గన్నవరం సీఐ పి . కనకరావు ఆధ్వర్యంలో, గన్నవరం ఎస్ఐ నవీన్ కుమార్, సిబ్బందితో బందాలుగా ఏర్పడి గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులపై నిఘా పెట్టినట్లు వివరించారు. ఈనెల 29 వ తేదిన రాత్రి సుమారు 8 గంటల సమయంలో గన్నవరం పోలీస్ స్టేషన్ పరిధిలో గల అల్లాపురం గ్రామం వద్ద ఏలూరు కాలువ సమీపంలో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు యువకులను అదుపులోకి తీసుకొని విచారించగా తమ్మిన విజయ్ బాబు, కటారి నరేష్, కటారి నవీన్, కగ్గా నరేంద్ర, గాంధీ లు ముఠాగా ఏర్పడినట్లు పోలీసుల విచారణలో తేలిందని తెలిపారు. దొరికిన ఐదుగురు యువకులపై కేసు నమోదు చేసి గన్నవరం కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్‌కు పంపించారన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

ప్రజాశక్తి-కంకిపాడు : బైక్‌పై కుమార్తెను స్కూల్‌లో దించేందుకు వెళుతున్న వ్యక్తిని ఎదురుగా వస్తున్న బండి ఢీకొన్న ఘటనలో తండ్రి,కుమార్తెలకు గాయాలైన సంఘటన కంకిపాడులో జరిగింది. వివరాల ప్రకారం కంకిపాడు లాకు రోడ్డుకు చెందిన మేడ సురేష్ స్కూటీపై తన కుమార్తెను స్కూల్‌లో దించేందుకు వెళుతుండగా స్థానిక రాయల్ ఫంక్షన్ హాల్ దగ్గర ఎదురుగా వస్తున్న బండి ఢీకొన్న ఘటనలో తండ్రి, కుమార్తెకు గాయాలయ్యాయి. వెంటనే వారిని 108 ఆసుపత్రిలో స్థానిక ఆసుపత్రికి తరలించారని కంకిపాడు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుడివాడ ఆలయంలో పూజలు

ప్రజాశక్తి - గుడివాడ : సంకటహర చతుర్థిని పురస్కరించుకొని స్థానిక మెయిన్ రోడ్ లో వేంచేసియున్న శ్రీ విఘ్నేశ్వర స్వామి వారి దేవస్థానంలో శ్రీ లక్ష్మీ గణపతి హోమం గురువారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన చైర్మన్ గంటా చంద్రశేఖర్ మాట్లాడుతూ స్వామివారి కృప కటాక్షాలతో యావత్ ప్రజానీకం సుఖసంతోషాలతో జీవించాలని ప్రతినెలా దేవస్థానం ఆధ్వర్యంలో లక్ష్మీ గణపతి హోమం వైభవంగా నిర్వహించడం జరుగు తుందన్నారు. దేవస్థాన అభివద్ధికి భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈవో, దేవస్థాన కమిటీ సభ్యులు, అర్చకులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



లక్ష్మీ గణపతి హోమం నిర్వహిస్తున్న దృశ్యం

తెలంగాణ సరిహద్దు చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు

ప్రజాశక్తి-గంపలగూడెం: తెలంగాణ ఎన్నికల నేపథ్యంలో గురువారం ఎన్టీఆర్ జిల్లా పోలీసులు చుట్టుప్రక్కల ఉన్న చెక్‌పోస్టుల వద్ద తనిఖీల్లో నిమగ్నమయ్యారు. తిరువూరు సిఐ ఎస్‌కె నభి, గంపలగూడెం ఎస్సై పి రాంబాబు గంపలగూడెం మండలంలో ఉన్న నెమలి, వూటుకూరు, రాజవరం గ్రామాల వద్ద గల చెక్‌పోస్టులను పరిశీలించారు. ఈ తనిఖీల్లో మైలవరం ఏసిపి రమేష్ పాల్గొన్నారు.

తిరువూరు: తిరువూరులోని ఆంధ్రా-తెలంగాణ అంతరాష్ట్ర చెక్‌పోస్టు వద్ద అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ ఎం.రమేష్ అధ్వర్యంలో పోలీసులు వాహనాలను గురువారం తనిఖీలు చేశారు. తెలంగాణలో ఎన్నికల పోలింగ్ జరిగిన నేపథ్యంలో ప్రతి వాహనాన్ని తనిఖీ



గంపలగూడెంలో వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

చేశారు. డివిజన్ పరిధిలో తెలంగాణ సరిహద్దుగా ఉన్న ఏడు మండలాల్లో ఎలక్షన్ కమిషన్ ఆదేశాల మేరకు ఐదు చెక్ పోస్టులు ఏర్పాటు చేశామని ఏసిపి తెలిపారు. డివిజన్ పరిధిలో 330 మంది రౌడీ షీటర్లు, లా అండ్ ఆర్డర్ సస్పెక్ట్ కలిగిన వ్యక్తులను బైండోవర్ చేశామన్నారు. 1078 మద్యం బాటిళ్లు,18 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ కార్యక్రమంలో సిఐ అబ్దుల్ నభి, ఎస్సైలు వి.సతీష్, ఏ పద్మారావు, సిబ్బంది పాల్గొన్నారు.

మైలవరం: తెలంగాణ రాష్ట్రంలో ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో అంతర్రాష్ట్ర చెక్పోస్టుల తనిఖీల్లో భాగంగా గురువారం విజయవాడ డిసిపి అజిత వేజెండ్ల మండలంలోని మనసుమల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేసిన అంతరాష్ట్ర చెక్ పోస్ట్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు వాహనాలను ఆపి చెక్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏసిపి ఎం రమేష్, సిఐ మోహన్ రెడ్డి, ఎస్సై హరిప్రసాద్ సిబ్బంది పాల్గొన్నారు.



కొండపల్లి అభివృద్ధికి కృషి చేయాలి

కలెక్టర్‌కు కాంగ్రెస్ నేతల వినతి

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం: మునిసిపాలిటీ ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలు గడిచినా పాలకవర్గం లేక అనాధగా మిగిలిన కొండపల్లి మునిసిపాలిటీని కాపాడాలని, కొండపల్లి ప్రధాన రహదారి విస్తరణ చేపట్టాలని గురువారం జిల్లా కలెక్టర్ డిల్లీరావును కాంగ్రెస్ పార్టీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు బొర్రా కిరణ్ కలిసి విజ్ఞప్తి చేశారు. కిరణ్ మాట్లాడుతూ కొండపల్లి పట్టణ ప్రజలకు ట్రాఫిక్ కష్టాలు రోజు రోజుకు పెరుగుతున్నాయని, ప్రధాన రహదారికి ఇరువైపులా ఆక్రమణలు పెరుగుతుండటమే దీనికి ప్రధాన కారణమన్నారు. పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన కొండపల్లి ప్రధాన రహదారి విస్తరణ ఆవశ్యకత ఎంతైనా ఉన్నందున ఆక్రమణలు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరినట్లు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో పీసీసీ కార్యదర్శి పోతురాజు ఏసుదాసు, డీసీసీ ప్రధాన కార్యదర్శి అక్కల ప్రసాద్ తదితరులు ఉన్నారు.

డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన

ప్రజాశక్తి-కంచికచర్ల: గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత క్రమంలో నిధుల ఖర్చు చేసి అభివద్ధి కి ప్రాధాన్యత



ఇస్తున్నట్టు నందిగామ ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్మోహన్ రావు అన్నారు. కంచికచర్ల మండలం చెవిటికల్లు గ్రామంలో 5 లక్షల రూపాయల వ్యయం తో చేపట్టిన సిసి డ్రైనేజీ నిర్మాణానికి గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బుడ్డి విజయలక్ష్మి, వైస్ ఎంపిపి వెలగలేటి మాధవి, నాయకులు బాబు, బుడ్డి సత్యం పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-మైలవరం: ఓటుతో ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని డిప్యూటీ తాసిల్దార్ శ్రీహరి, ఎల్‌బిఆర్‌సిఈ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు అన్నారు. గురువారం స్థానిక ఎల్బీఆర్ సీఈ కళాశాలలో ఎల్‌బి ఆర్‌సి కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో ఓటు పై అవగాహన సదస్సు జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం లాంటిదని, ఓటు ద్వారానే మంచి పాలకులను ఎన్నుకోవచ్చన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులచే ఓటర్ దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎస్.ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌సి సెల్ నాయకుల మధ్య వివాదం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: టిడిపి తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ ఎన్‌టిఆర్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా అధ్యక్షులు సొంగా సంజయ్ వర్మ ఆధ్వర్యంలో నగరంలోని లారీ ఓనర్స్ అసోసియేషన్ హాల్ నందు దళిత శంఖారావ సభ గురువారం జరిగింది. ఈసందర్భంగా జరుగుతున్న సమావేశంలో ఎన్‌టిఆర్ జిల్లా ఎస్‌సి సెల్ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ఎవరికి వారు సమావేశాలు బాధ్యులు లేకుండా నిర్వహించుకుంటే ఎలా అంటూ ఒకరినొకరు వాదోపవాదాలు చేసుకున్నారు. దీనితో సభ జరుగే ప్రారంభ సమయంలోనే సభా ప్రాంగణంలో వివాదం ప్రారంభమైంది. సభా వేదికపై కేశినేని చిన్ని , కేశినేని నాని ఫోటోల విషయమై ఇరు వర్గాల వారు మాటా మాటా అనుకున్నారు. మా నాయకుడి ఫోటో ఉండాలని కేశినేని నాని వర్గం అలాగే మా నాయకుడి ఫోటో ఉండాలని చిన్ని వర్గం వాదించకున్నారు. వివాదం పెద్దదవుతున్న సమంయలో అక్కడకు చేరుకున్న తెలుగేదశం పార్టీ సీనియర్ నాయకులు వర్ల రామయ్య వారిని సర్ధిచెప్పడంతో వివాదం ముగియడంతో సభను నిర్వహించారు. ఈకార్యక్రమంలో తేదేపా తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి సావల దేవదాస్, కృష్ణాజిల్లా ఎస్‌సి సెల్ అధ్యక్షులు ఆది నారాయణ, ఎస్‌సి సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి జయరాజ్ పలవురు నాయకులు పాల్గొన్నారు.



వైసిపితో ప్రతి ఇంటికీ లబ్ధి : చైర్మన్

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: రాష్ట్రం బాగుండాలంటే, ప్రజలంతా ఆనందంగా జీవించాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తోనే సాధ్యమని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్రరావు అన్నారు. పట్టణంలోని 9వ సచివాలయం 19, 21 వార్డ్ లు నందు ప్రభుత్వవిప్, సామినేని ఉదయభాను ఆదేశానుసారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, జిల్లా చేనేత విభాగం అధ్యక్షులు పెంటి శ్రీనివాస్ పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందిస్తూనే అభివద్ధి పథంలోని దూసుకుపోతున్నారన్నారు. గత చంద్రబాబు పాలనలో ప్రజలకు ఎలాంటి లబ్ధి చేకూరాలేదని, నేడు మన జగనన్న సంక్షేమ పాలనలో ప్రతి ఇంటికి లక్షకు పైగా లబ్ధి చేకూరిందన్నారు. అదేవిధంగా నియోజకవర్గంలో సామినేని ఉదయభాను గారి కషితో గతం కంటే నేడు ఎక్కువ అభివద్ధి జరుగుతుందన్నారు. ప్రజలకు మంచి చేసే జగనన్నను ఇక్కడ సామినేని ఉదయభాను గారిని మరొకసారి గెలిపించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్టి విభాగం అధ్యక్షులు బద్దు నాయక్, నాయకులు గేల్లా పూర్ణచంద్రరావు, చందా రామచంద్రరావు, అలాసపూరి వెంకటేశ్వరరావు, పెద్దపురపు సుధర్, కొంకిమళ్ల మురళి పాల్గొన్నారు.

కొండపల్లిలో టిడిపి ప్రచారం

ప్రజాశక్తి-ఇబ్రహీంపట్నం

కొండపల్లి మున్సిపాలిటీలో జరిగిన భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్తుకు గ్యారంటీ తెలుగు దేశం పార్టీ రూపొందించిన మేనిఫెస్టోను విస్తతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలి అని మేనిఫెస్టోలో అంశాలను ప్రజలకు అర్థమయ్యేలా వివరించి , ఈ ప్రభుత్వం వారిని ఎలా మోసం చేస్తుందో తెలియజేయాలన్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో అన్ని వర్గాలు, వ్యవస్థలకూ నష్టం కలిగిందన్నారు. ముఖ్యంగా యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేవన్నారు. రైతుల సమస్యలు వర్ణనాతీతంగా ఉన్నాయన్నారు. మహిళలకు రక్షణ లేకుండా పోయిందన్నారు.

5న బస్సు యాత్రను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కంచికచర్ల

ఈ నెల ఐదో తేదీన నందిగామ పట్టణంలో జరగనున్న సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ డాక్టర్ మొండితోక అరుణ్‌కుమార్ కోరారు. కంచికచర్ల మార్కెట్ యార్డ్ వద్ద గురువారం వైసిపి ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లడుతూ స్థానిక నాయకులు ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి సామాజిక సాధికార బస్సు యాత్రకు ప్రజలను ఆహ్వానించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి బండి మల్లిఖార్జన్ రావు, జడ్పీటీసీ వేల్పుల ప్రశాంతి, మాజీ ఎంపిపి పాటిబండ్ల హరి, ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు, సొసైటీ అధ్యక్షుడు కాలవ పెదబాబు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల బుక్‌లెట్ పంపిణీ

ప్రజాశక్తి-నందిగామ: అనాసాగరం 19వ వార్డులో 'గడపగడపకు -మన ప్రభుత్వం' కార్యక్రమంలో భాగంగా గురువారం సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు ప్రజలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంఎల్‌ఎ మాట్లాడుతూ వైయస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీ నాలుగన్నరేళ్లలో నందిగామ నియోజకవర్గ చరిత్రలో కనీవిని ఎరగని అభివృద్ధి జరిగిందని తెలిపారు.



మూడు వేల మందికి అన్నదానం

ప్రజాశక్తి-మైలవరం: మైలవరంలో వేంచేసి ఉన్న శ్రీ భ్రమరాంబ మల్లేశ్వర స్వామి దేవస్థానంలో కార్తీకమాసం సందర్భంగా గురువారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. ద్వారకాతిరుమల దేవస్థానం చైర్మన్ ఎస్‌వి సుధాకర్‌రావు ఆధ్వర్యంలో జరిగిన కల్యాణ మహోత్సవంలో అనేక మంది యాత్రికులు పాల్గొన్నారు. అనంతరం దేవాలయ ప్రాంగణంలో జరిగిన అన్నదాన కార్యక్రమాన్ని ధర్మకర్తలు నివృత్‌రావు ప్రారంభించారు. దాదాపు మూడు వేల మంది అన్నప్రసాదాన్ని స్వీకరించారు.



వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి-గంపలగూడెం

మండల పరిధిలో ఉన్న పెద్ద కొమెర గ్రామ దళిత వాడకు చెందిన మోదుగు వెంకటేశ్వర్లు (65) పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బుధవారం రాత్రి మందు తాగిన కొద్దిసేపటికి కడుపులో మంట వస్తుందని కుటుంబ సభ్యులకు తెలిపాడు. అతన్ని వెంటనే స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు ఆసుపత్రికి తీసుకువెళ్లగా కొద్దిసేపటికి మృతిచెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని తిరువూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మంచినీటి సరఫరాపై తిరువూరు కౌన్సిల్లో వాదోపవాదాలు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు నగర పంచాయతీ సాధారణ కౌన్సి ల్ సమావేశం అధికార, ప్రతిపక్ష సభ్యుల వాదోపవాదనలతో దద్దరిల్లింది. చైర్ పర్సన్ గతం కస్తూరిబాయి అధ్యక్షతన గురువారం జరిగిన సమావేశంలో జాంబవంతుని పంపింగ్ స్కీం పాడవటంతో తమ వార్డుకు మంచినీళ్లు సరఫ రా నిలిచిపోయిందని టిడిపి సభ్యులు అబ్దుల్ హుస్సేన్ ఆరోపించారు. పట్టణంలో సరైన డ్రైనేజీ వ్యవస్థ లేనందున స్టోమ్ వాటర్ డ్రైనేజీ నిర్మాణం కొరకు డీటైల్డు ప్రాజెక్టు రిపోర్టు తయారు చేయుటకు కొటేషన్లు పిలిచేందుకు వచ్చిన అంశంపై టిడిపి సభ్యులు హుస్సేన్‌తో పాటు నాళ్ల సురేంద్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తిరువూరు వచ్చినప్పుడు ముఖ్యమంత్రి జగన్ డ్రైనేజీ నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు చేస్తున్నానని ప్రకటించారని, వాటికి డిటైల్డు ప్రాజెక్టా, ఎరే నిధుల కోసం డిటైల్డు ప్రాజెక్టా అని టిడిపి సభ్యులు అధికారులను ప్రశ్నించారు. దీనిపై అధికార పార్టీ సభ్యుడు పర్సా శ్రీనివాసరావు వివరణ ఇస్తుండగా అధికారులు సమాధానం చెప్పాలని టిడిపి సభ్యులు అభ్యంతరం తెలపడంతో ఇరువర్గాల మధ్య వాదోపవాదనాలు బలంగా జరిగాయి. దీంతో కమిషనర్ బాలకృష్ణ కలుగజేసుకొని ముఖ్యమంత్రి ప్రకటించిన నిధులకు కాదని, వేరే నిధులతో డ్రైనేజీ నిర్మాణానికి డీటెల్డు ప్రాజెక్టు కోసమని చెప్పారు. దీంతో సభ్యులు శాంతించారు. మంచినీటి సమస్య పరిష్కారం కోసం కషి చేస్తున్నామని బోరు కూడా వేసామని, కాకపోతే వర్షాభావ పరిస్థితుల వల్ల భూగర్భ జలాలు అడుగంటాయని, బోర్లు నుండి మంచినీళ్లు రావట్లేదని, నాగార్జున సాగర్ జలాలు వస్తున్నందున భూగర్భ జలాలు పెరిగే అవకాశం ఉంటుందని, త్వరలోనే



తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని పరసా శ్రీనివాసరావు వెల్లడించారు. నిధులు కొరత అధికంగా ఉందని ఇంటి, మంచినీటి కుళాయి పన్నులు ప్రజల నుండి రావ డంలేదని, కౌన్సిలర్లు ప్రజలతో మాట్లాడి పన్నులు చెల్లించే విధంగా సిబ్బందికి సహకరించాలని కమిషనర్ కోరారు.

విద్యార్థి దశ నుండే సమాజానికి ఉపయోగపడాలి

- ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య హేమచంద్రారెడ్డి
- అట్టహాసంగా కృష్ణా తరంగ్-2023 ప్రారంభం

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : విద్యార్థులు తాము సమాజానికి ఏ విధంగా ఉపయోగపడగలమో ఆలోచించాలని, అలా అలోచించిన విద్యార్థులే మంచి భవిష్యత్ ను ఆస్వాదిస్తారని రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ఆచార్య కె హేమచంద్రరెడ్డి పేర్కొన్నారు. గురువారం కష్ణా విశ్వవిద్యాలయంలో కష్ణా తరంగ్-2023 ప్రారంభోత్సవ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేవలం చదువుకోవడం వల్ల ఉద్యోగం చేయడానికి మాత్రమే మనిషి ఉపయోగపడతారు గానీ సంపూర్ణ వ్యక్తి గా రూపాంతరం చెందలేరన్నారు. విద్యార్థులు తమలో దాగి ఉన్న చెడు అలవాట్లు ను ధ్వంసం చేయకుండా మార్పు చెందిన మనిషి కాలేరని హితవు పలికారు. ఓటమి, సంక్షోభం,సంఘర్షణ అనేవి జీవితంలో భాగమేనని వాటి నుండి బయటకు



మాట్లాడుతున్న కె హేమచంద్రరెడ్డి

వచ్చినప్పుడు విజయం వైపు వెళ్లగలమన్నారు. అద్దం మీద మురికి పడితే ముఖం ఎలా కనపడకుండా వుంటుందో మనలో కొన్ని కోరికలు తొలగించుకున్నప్పుడే భవిష్యత్తు వుంటుందన్నారు. ఉపకులపతి ఆచార్య జి జ్ఞానమణి అధ్యక్షోపన్యాసం చేస్తూ విద్యార్థుల్లో ఐక్యత, స్నేహభావం పెంపొందించుకోవడం కోసం ఇలాంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయి అని చెప్పారు. గెలుపు, ఓటములు సహజమే అయినప్పటికీ పోటీలలో పాల్గొనడం అలవాటు చేసుకోవడం మంచిదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ శాసన సభ్యులు ఎన్ శేషరెడ్డి, రెక్టర్ ఆచార్య డి సూర్యచంద్రరావు, రిజిస్ట్రార్ డా పి వీర బ్రహ్మచారి, కష్ణా తరంగ్ 2023 కన్వీనర్ డా ఎం కోటేశ్వ రరావు తదితరులు ప్రసంగించారు. తొలుత అతిథులు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుందర కష్ణా, విశ్వవిద్యాలయ సభ్యులు మాధవి, సుభాషిణి, దినేష్‌లు పాల్గొనగా సభానంతరం అతిథులను సత్కరించారు.

వసుమతి మృతికి నివాళులు

ప్రజాశక్తి-చల్లపల్లి : చల్లపల్లి మండలం వెలివోలులో భూ పోరాట యోధుడు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు కోగంటి రాఘవయ్య సతీమణి వసుమతి(90) వయో భారంతో స్వగృహంలో మృతి చెందారు. ఆమె పార్థివదేహాన్ని సిపిఎం పార్టీ నేతలు మహమ్మద్ కరీముల్లా, కుంపటి బాబురావు, కుంపటి బేబీ సరోజిని బుధవారం



సందర్శించి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి తెలిపారు. వసుమతి చల్లపల్లి జమిందార్ పెత్తందార్ల విధానాలపై వ్యతిరేకంగా పోరాడిన కమ్యూనిస్టు యోధులకు పరోక్షంగా సహకారం అందించినట్లు గ్రామస్తులు తెలిపారు. ఆమె భర్త గతంలో చనిపోగా ఆమెకు నలుగురు కుమారులు ఒక కుమార్తె కలరు. బుధవారం బంధువులు, కుటుంబ సభ్యులు ఆమెకు అంత్యక్రియలు నిర్వహించి కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత పశు వైద్యాధికారి అన్నే బాబురావు. విశ్రాంత ఎంపీడీవో ఏ ఆర్. కె.ప్రసాద్,మాలెంపాటి రంగారావు గ్రామ ప్రముఖులు పాల్గొన్నారు

కొమ్మరాజుకు ఎంఎల్ఏ పరామర్శ

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం మండల వైస్ ఎంపీపీ కొమ్మ రాజు సుధీర్ పితవియోగానికి గురయ్యారు. ఈ విషయం తెలుసుకున్న శాసనసభ్యులు డాక్టర్ వల్లభనేని వంశీ మోహన్ గురువారం రాయనగర్‌లోని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనగాని రవి, వైసీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి : ఎండిఓ

ప్రజాశక్తి-ఘంటసాల : కేంద్ర ప్రభుత్వం అందించే పథకాల ప్రతీ ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని మండల పరిషత్ అభివద్ధి అధికారిణి టి. అనూహ్య అన్నారు. గురువారం మండల పరిధిలోని మల్లంపల్లి, దాలిపర్రు గ్రామాల్లో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర కార్య క్రమాలను నిర్వహించారు. రెండు గ్రామాల్లో జరిగిన సభల్లో ఎంపిడివో మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ సంక్షేమ, అభివద్ధి కార్యక్రమాలను అందించాలనే లక్ష్యంతో ప్రధాని మోడీ పరిపాలన సాగిస్తున్నట్లు తెలిపారు. పేదరిక నిర్మూలన చేసి ప్రజలను ఆర్థికాభివద్ధి వైపుకు నడిపించేలా కషి చేస్తున్నట్లు వివరించారు. మహిళలకు ఉజ్వల్ పథకం కింద ఉచితంగా గ్యాస్ కనెక్షన్లు, ముద్ర లోన్లు, ఆయుష్మాన్ భారత్ వంటి పలు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టడంతోపాటు గ్రామాల్లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన కింద గహ నిర్మాణాలు, సీసీ రహదారుల నిర్మాణం తదితర అభివద్ధి పనులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం ద్వారా పథకాలు పొందిన వారి అభిప్రాయాలు సేకరించటంతోపాటు అందని వారి వివరాలను నమోదు చేసుకున్నారు. అనంతరం గ్రామ సర్పంచ్ డి.శాంతకుమారి నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపిడివోను సత్కరించారు. ఆయా కార్యక్రమాల్లో సర్పంచ్ లు డొకిపర్తి శాంతకుమారి, బెల్లంకొండ అమలేశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు కొలుసు ఝాన్సీలక్ష్మి, ఈవోపిఆర్డి గుత్తికొండ కిషోర్ పాల్గొన్నారు.



ఆయిల్ ఫామ్ తోటలతో అధిక లాభాలు

ప్రజాశక్తి-చల్లపల్లి : ఆయిల్ ఫామ్ తోటల్ పెంపకం వల్ల అధిక లాభాలు పొందవచ్చని అవనిగడ్డ ఉద్యోగుల శాఖ అధికారి ఎన్ రమేష్ రైతులకు సూచించారు. చల్ల పల్లి మండల పరిధిలోని వక్కల గడ్డలో ఉండవల్లి ఆగ్రోస్ కంపెనీ ఏర్పాటు చేసిన నర్సరీని గురువారం ఆయన సందర్శించారు. ఆయిల్ ఫామ్ తోటలలో ఎరువులు పురుగు మందులు వాడకం తక్కువగా ఉంటుందని వివరించారు. ఎకరానికి 57 మొక్కలు నాటాలని అన్నారు. ఒక హెక్టరుకు 20వేల రూపాయలు రాయితీ ఉంటుందని వివరించారు. నాలుగు సంవత్సరాల మొక్కల పెంపకానికి 21 వేల రూపా యలు, సంవత్సరంనకు రూ 5250 అందిస్తారని చెప్పారు. మొక్క నూట తొంబై మూడు రూపాయలకే అమ్మాలని, కొనుగోలు చేసిన రైతులకు బిల్లు ఇవ్వాలని కంపెనీ యాజమాన్యానికి సూచించారు. పరిసర ప్రాంత రైతులు ఈ అవకాశాన్ని చేసుకోవాలని కోరారు.

ఐక్యతా విజయపథం పాదయాత్ర

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల అభివద్ధి కోసం ఐక్యంగా పోరాడేందుకు సిద్ధం కావాలని రాష్ట్ర ప్రభుత్వ మాజీ కార్యదర్శి విజయ్ కుమార్ పిలుపునిచ్చారు. పేదరికం నుండి పేద జన విముక్తి ధ్యేయంగా చేపట్టిన ఐక్యతా విజయ పథం పాదయాత్ర గురువారం గుడ్లవల్లేరు చేరుకుంది. స్థానిక దళిత నాయకులు విజయ్ కుమార్ ని పుష్పగుచ్ఛాలతో స్వాగతం పలికారు. స్థానిక ప్రధాన సెంటర్లోని అంబేద్కర్ విగ్రహానికి ఆయన పూలమాలవేసి నివాళు లర్పించారు. అనంతరం విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రజలు పడుతున్న సామాజిక, రాజకీయ, ఆర్థిక ఇబ్బందుల పరిష్కారానికి ఈ యాత్రను తండాలో ప్రారంభించామని ఇప్పటికి 17 43 కిలోమీటర్లు కు చేరుకోవడం జరిగిందని తెలిపారు. రాష్ట్రంలో 70 శాతం ప్రజలు పేదరికంలోనే జీవిస్తున్నారని, వారి నిర్మూలనకు పేద సామాజిక వర్గాలంతా సంఘటితం కావాలని కోరారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల ప్రజల అభిప్రాయాలు సేకరించి ఐక్యవేదికను ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పెయ్యల సురేష్ బాబు, వారా పాపారావు, పిడుగు దేవ సహాయం, మేక అనిల్, వెంకటేశ్వరరావు, బుల్ల కింగ్, దారం నిరంజన్ రావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కరాటేలో శ్రీచైతన్య విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్: విద్యార్థులు చదువుతో పాటు చిన్ననాటి నుంచే అన్ని రంగాల్లో రాణించాలని ప్రధానోపాధ్యాయులు వి.రాజేష్ అన్నారు. స్థానిక హను మాన్ జంక్షన్ శ్రీ చైతన్య పాఠశాల నందు చదువుతున్న విద్యార్థులు రాష్ట్ర స్థాయి కరాటే ఛాంపియన్ షిప్‌లో అద్భుతమైన ప్రతిభను కనపరిచారని అయన తెలిపారు. సికో షాటో ఖాన్ అడ్వాన్స్డ్ కరాటే ఇండియా మెంబర్ ఆఫ్ కరాటే ఇండియా ఆర్గనైజేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీలలో పాఠశాలలో చదువుతున్న గుణవర్ధన అచ్యుత, కీర్తిక, జాహ్నశ్రీ ,ఫిరోజ్ విద్యార్థులు బంగారు పతకాలను, యం.భార్గవి వెండి పతకం, యం.రోషిని రజిత పతకాలను గెలిపొందారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు వి.రాజేష్ పతకాలను,ప్రశంసా పత్రాలను క్రీడాకారులకు అందజేసి అభినందించారు.


విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

విద్యార్థులను చక్కగా కరాటేలో తీర్చిదిద్దిన కరాటే అధ్యాపకులు శ్రీనివాస్ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డీన్ రహీమ్, సి.బ్యాచ్ ఇన్చార్జి మురళీ కష్ణ, ఎ.జి.యం. శ్రీ యస్. పార్థసారధి, రీజినల్ ఇన్ చార్చి ఉదయ్ భాస్కర్,సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అభినందనలు తెలిపారు.

పాడిపరిశ్రమతో ఆర్థికస్వావలంబన : చలసాని

ప్రజాశక్తి-హనుమాన్‌జంక్షన్ : పాడిపరిశ్రమ వల్ల మహిళ సాధికారికతతో పాడి కుటుంబం ఆర్థికస్వావలంబన సాధ్యమని గోళ్ల జయమ్మ నిరూపించిందని కష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్ చలసాని ఆంజనేయులు కొని యాడారు. కాకులపాడుకు చెందిన గోళ్ల జయమ్మ ఇండియన్ అసోసియేషన్ అఫ్ ఉమెన్ వెటరెరిన్స్ (ఐఎడబ్ల్యువీ) నుండి ఉత్తమ మహిళ పాడిరైతు పురస్కారం అందుకున్న సందర్భంగా గురువారం అభినందన కార్యక్రమం నిర్వహించారు.ఇండియన్ అసోసి యేషన్ అఫ్ ఉమెన్ వెటరెరిన్స్ ఆధ్వర్యంలో ఆత్కూరు స్వర్ణభారత్ ట్రస్ట్ ఆడిటోరియంలో నిర్వహించిన 17వ టెక్నికల్ కాన్ఫరెన్స్ కాకులపాడుకు చెందిన గోళ్ల జయమ్మ ఉత్తమ మహిళ పాడిరైతుగా ఎంపికయ్యారు.మహిళల ఆర్థికస్వావలంబనతోనే పాడిరైతు కుటుంబాలు ఆర్థికపరిపుష్టి సాధిస్తాయని, కష్ణామిల్క్ యూనియన్ అందుకు సంపూర్ణ సహకారమందిస్తామని చలసాని తెలిపారు.తన స్వగ్రామంలోని మహిళా పాడిరైతు ఉత్తమ పురస్కారం పొందటం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు.


ఉత్తమ మహిళ పాడిరైతు గోళ్ల జయమ్మను సత్కరిస్తున్న చైర్మన్ చలసాని ఆంజనేయులు

కాకులపాడుకు పాల సేకరణ కేంద్రం వద్ద చైర్మన్ చలసాని జయమ్మను సర్కరించి అభినందించారు. యూనియన్ ద్వారా అందించే వివిధ పథకాలు, సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెంచుతూ ప్రతి పాడిరైతు కుటుంబం ఆర్థికాభివద్ధి సాధించాలని చైర్మన్ చలసాని అంజ నేయులు సూచించారు.ఈ కార్యక్రమంలో సంఘ పాలకవర్గ సభ్యులు,పాడి రైతులు,వేతన కార్యదర్శి, సూపర్ వైజర్, తదితరులు పాల్గొన్నారు.

ఇబ్బందుల్లేకుండా ధాన్యం కొనుగోలు చేయాలి

ప్రజాశక్తి-అవనిగడ్డ : ధాన్యం కొనుగోలులో రైతులకు ఇబ్బంది లేకుండా చూడాలని మాజీ ఉపసభాపతి మండలి పెద్ద ప్రసాద్ సూచించారు. గురువారం ఆయన విలేకరు లతో మాట్లాడుతూ హార్వెస్టర్ మిషన్తో హార్వెస్ట్ చేసిన రైతులందరూ ఇబ్బందులు పడుతున్నట్లు చెప్పారు. దీనితో రైతులు ఆందోళనకు గురవుతున్నారని తెలిపారు. దాన్యంలో తేమ శాతం 20 ఉంటే తీసుకోమని ఆర్బికేల్లో చెబుతున్నారని 17 శాతం మించి ఉంటే ఒక కేజీ తగ్గించి తీసుకుంటున్నారని రైతులు చెబుతున్నట్లు తెలిపారు.



అసలే వాయుగుండం ప్రభావంతో రైతులు ఆందోళన చెందుతుంటే ఇలాంటి నిబంధనలతో రైతులను ఇబ్బందులకు గురిచేయడం సబాబు కాదన్నారు. దాన్యం ఆరబెట్టుకునే సౌకర్యాలు లేకుండా 20 శాతం తేమ ఉంటే దాన్ని ఆరబెట్టాలని వ్యవసాయ శాఖ అధికారులు చెప్పడం సరికాదన్నారు. జిల్లా కలెక్టర్ కలగజేసుకొని నిబంధనలు సడలించాలని ప్రభుత్వం మద్దతు ధరకే ఇటువంటి షరతులు లేకుండా ధాన్యం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని బుద్ధ ప్రసాద్ కోరారు.



త్వరగా రోడ్లను పూర్తి చేయండి : దినకర్

ప్రజాశక్తి - విజయవాడ : ప్రజలకు ఇబ్బంది కలగకుండా త్వరగా రోడ్లను పూర్తి చేయాలని విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. కాంట్రాక్టర్లతో తన చాంబర్లో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రోడ్లను సకాలంలో పూర్తి చేయాలని ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూసుకోవాలని. కాంట్రాక్టర్లకు అప్పచెప్పిన పనులు విధుల ప్రకారం నిర్వహించాలన్నారు.



జూనియర్ అసిస్టెంట్ నాగ దుర్గకు సత్కారం

ప్రజాశక్తి - విజయవాడ : నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో వాట్ స్పెషల్ సెల్లో జూనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న నాగ దుర్గ గురువారం స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. ఏప్రిల్ 27 1988న రికార్డు అసిస్టెంట్ గా తమ సేవలు అందించి తదుపరి బిల్ కలెక్టర్ గా అవుట్ డోర్ లో ఫీల్డ్ వర్క్ చేసి ప్రజలకు తమ వంతు సేవలు అందించారు. 2019లో ఉద్యోగోన్నతి పొంది 89 సచివాలయంలో అడ్మిన్ సెక్రెటరీగా విశిష్ట సేవలు అందించి కార్పొరేషన్ పలు విభాగాల్లో పనిచేసి అధికారుల మన్నెలను పొందారు. 2021 జూనియర్ అసిస్టెంట్‌గా ఉద్యోగోన్నతి పొంది సర్కిల్ 3 రెవెన్యూ ఇన్స్పెక్టర్‌గా సేవలందించారు. విఎంసిలో 35 సంవత్సరాలపాటు సేవలందించారు. ఈ సందర్భంగా ఆమెను అధికారులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ ప్రాజెక్ట్స్ కె వీ సత్యవతి, విఎంసికి చెందిన పలు విభాగాల సూపరిండెంట్లు, ఇతర సిబ్బంది ఆమె తన సర్వీసులో చేసిన సేవలను అభినందించారు.

అసిస్టెంట్ కమిషనర్ ఉద్యోగ విరమణ

నగరపాలక సంస్థ వివిధ క్యాడర్లలో 40 సంవత్సరాలుగా పనిచేసిన సర్కిల్ -3 అసిస్టెంట్ కమిషనర్ ఎం.రాజకుమార్ గురువారం ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనను సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ మునిసిపల్ ఎంప్లాయిస్ సర్వీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డి. వెంకట లక్ష్మి, జోనల్ కమిషనర్ ఎం.కష్ణ, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ జూబిన్, రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ సాంబశివరావు పాల్గొన్నారు.

కనకదాస జీవితం ఆదర్శం : కలెక్టర్

ప్రజాశక్తి - విజయవాడ : సమాజంలోని ప్రతి ఒక్కరికీ అర్థమయ్యేలా సంగీత సాహిత్యాలతో అనుసంధానం చేసి తత్వజ్ఞానాన్ని అందించేందుకు ఎంతో కృషిచేసిన కన్నడ కవి, సంగీతకారుడు, స్వరకర్త కనకదాస జీవితం ఆదర్శప్రాయమని జిల్లా కలెక్టర్ ఎస్.డిల్లీరావు అన్నారు. గురువారం కనకదాస జయంతి సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ డిల్లీరావు.. కనకదాస చిత్రప టానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిం చారు. ఈకార్యక్ర మంలో జిల్లా గిరిజన సంక్షేమ అధికారి, ఇన్‌ఛార్జ్ బీసీ సంక్షేమ అధికారి ఎం.రుక్మాంగదయ్య, సహాయ బీసీ సంక్షేమ అధికారి హరి బాబు, సూపరిం టెండెంట్ రాజ కుమారి పాల్గొన్నారు.



3న ఎన్ఎంఎంఎస్ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి : డిఇఓ

ప్రజాశక్తి - విజయవాడ : డిసెంబరు 3వ తేదీన జరిగే నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎన్‌టీఆర్ జిల్లా డీఈవో సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనుందన్నారు. జిల్లాలో జెడ్‌పీ హైస్కూల్ (నందిగామ), శ్రీవిద్యా హైస్కూల్ (రైతుపేట, నందిగామ), శ్రీచైతన్య హైస్కూల్ (రైతుపేట, నందిగామ), నారాయణ ఈఎం హైస్కూల్ (రైతుపేట, నందిగామ), రవీంద్రభారతి ఈఎం హైస్కూల్ (నందిగామ), జెడ్‌పీ గర్ల్స్ హైస్కూల్ (నడిమి, తిరువూరు), గవర్నమెంటు హైస్కూల్ (తిరువూరు), శ్రీనిధి టెక్నో హైస్కూల్ (తిరువూరు), కేబీసీ జెడ్‌పీ బాలుర హైస్కూల్ (పటమట, విజయవాడ), కేఎస్ఆర్‌జెడ్‌పీ గర్ల్స్ హైస్కూల్ (పటమటలంక, విజయవాడ), బీఎస్ఆర్‌కేఎంసీ హైస్కూల్ (ఎంజీ పురం, విజయవాడ), ఏకేటీపీఎంసీ హైస్కూల్ (ఎస్ఎన్ పురం, విజయవాడ), ఎంకే బైగ్ మెక్ ఎంసీ హైస్కూల్ (ఏఎస్‌నగర్, విజయవాడ), గాంధీజీ ఎంపీఎల్ హైస్కూల్ (వన్‌టౌన్, విజయవాడ), బిషప్ అజరయ్య హైస్కూల్ (విజయవాడ)లో పరీక్ష జరగనున్నట్లు డీఈవో రేణుక వెల్లడించారు.

ఇవిఎం, వివిప్యాట్ల పరిశీలన



ప్రజాశక్తి - విజయవాడ : గొల్లపూడిలోని ఈవీఎం, వీవీప్యాట్ గోదామును కలెక్టర్ ఎస్.డిల్లీరావు గురువారం పరిశీలించారు. ఈకార్యక్రమంలో డీఆర్‌వో ఎస్‌వీ నాగేశ్వరరావు, కలెక్టరేట్ ఎన్నికల సెల్ సూపరింటెండెంట్ సీహెచ్ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.



కేంద్ర ప్రభుత్వ పథకాలపై ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలిస్తున్న గవర్నర్

డిజిటల్ ప్రచార వాహనం ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

కార్యక్రమాల నిర్వహణకు జిల్లా మండల గ్రామ స్థాయిలో అన్ని శాఖల అధికారులతో కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 17 కేంద్ర పథకాల ద్వారా లబ్ధి పొందిన వివరాలు కలెక్టర్ తెలియజేశారు.

సాంస్కృతిక ప్రదర్శనలు

ఈ కార్యక్రమంలో పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కతిక నత్యాలు ఆకట్టుకున్నాయి. పాఠశాలల విద్యార్థులతోపాటు జానపద కళాకారులు నత్య రూపకాలను ప్రదర్శించారు. స్థానిక రాజుపేటకు చెందిన లిటిల్ ఫ్లవర్ పాఠశాల విద్యార్థులు కూచిపూడి నత్యంతో గవర్నర్‌కు స్వాగతం పలికారు. అనంతరం, ఆధునిక కాలంలో రసాయనిక ఎరువులతో చేస్తున్న వ్యవసాయం వల్ల భూమికి జరుగుతున్న దుష్పరిణామాలను వివరిస్తూ స్థానిక శ్రీ బాలాజీ విద్యాలయం పాఠశాల విద్యార్థులు నత్య రూపకం ప్రదర్శించారు. 17 రకాల కేంద్ర ప్రభుత్వ సంక్షేమాభివద్ధి పథకాలపై అవగాహన కల్పిస్తూ జానపద కళాకారులు బుర్రకథను ప్రదర్శించారు.

పలువురికి సత్కారం

రసాయన ఎరువులు, పురుగు మందులు వాడకుండా కేవలం సంప్రదాయ జీవన ఎరువులు వినియోగించి మంచి దిగుబడులు సాధిస్తున్న ఆదర్శ రైతు గణేశన రమేష్ బాబు(సుల్తానగరం)ను, స్వయం ఉపాధి కల్పించడంలో గుడివాడకు చెందిన ఆదర్శ జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు తోట మునెమ్మను, జలజీవన్ మిషన్ క్రింద బంటుమిల్లి మండలం మలపరాజు గూడెం గ్రామంలో స్వచ్ఛమైన తాగునీటితో నూరు శాతం కుళాయి కనెక్షన్లు అందించినందుకు గ్రామ సర్పంచ్ దూసనపూడి అవతారంకు రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా మెమెంటోలు అందించారు. తొలుత సమావేశంలో వికసిత్ భారత్ సంకల్పయాత్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో జిల్లా పరిషత్ చైర్ పర్సన్ ఉప్పాల హారిక, సీఈవో జ్యోతి బసు, రాష్ట్ర వ్యవసాయ మిషన్ వైస్ చైర్మన్ ఎంవిఎస్ నాగిరెడ్డి, రాష్ట్ర గ్రామ వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి జి లక్ష్మీశా, ఎస్పీ పి జాషువా, డిఆర్ఓ పెద్ది రోజా, డిపివో నాగేశ్వర్ నాయక్, ఆర్డీవోలు ఎం వాణి, పద్మావతి, డ్వామా, డియార్డియే పీడీలు జివి సూర్యనారాయణ , పి ఎస్.ఆర్ ప్రసాద్, అవనిగడ్డ శాసనసభ్యులు సింహాద్రి రమేష్ బాబు, కేడీసీసీ బ్యాంక్ చైర్ పర్సన్ తాతినేని పద్మావతి, నగర మేయర్ చిటికెన వెంకటేశ్వ రమ్మ, డిప్యూటీ మేయర్లు శీలం భారతి, మాడపాటి విజయలక్ష్మి పాల్గొన్నారు.



మహిళా రైతులను చైతన్యం చేయడమే లక్ష్యం

- డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాధికారెడ్డి



ప్రజాశక్తి-ఉంగుటూరు : దేశం నలుమూలలలో పనిచేస్తున్న మహిళా పశు వైద్యులందరినీ ఒకచోట ఏకీకృతం చేసి తద్వారా మార్పులను తీసుకువచ్చి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మహిళా రైతులను చైతన్య పరచాలనేదే జాతీయ సదస్సు ముఖ్య ఉద్దేశం అని డాక్టర్ వైయస్సార్ ఆరోగ్య వైద్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వి. రాధికారెడ్డి అన్నారు. గురువారం ఆత్కూరు స్వర్ణ భారతి ట్రస్ట్ నందు శ్రీ వెంకటేశ్వర పశు వైద్య విశ్వవిద్యాలయం మరియు జాతీయ మహిళా పశు వైద్యుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో ఎన్టీఆర్ పశు వైద్య కళాశాల గన్నవరం వారు నిర్వహించిన జాతీయ సదస్సులో రెండవ రోజు ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ వి రాధికా రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. పశువైద్య శాఖతో అనుసంధానమైన పలు పరిశోధనలను పశువైద్య రంగానికి మిళితం చేస్తూ ఉన్న గ్రామీణ మహిళలను చైతన్య పరచడంలో కీలక భూమిక పోషించాలని అన్నారు. వైద్య వత్తిని తన కుటుంబం కన్నా మిన్నగా భావించాలని ఆ విధమైన సేవల ద్వారానే మహిళలను చైతన్య పరచగలుగుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజింగ్ కార్యదర్శి డాక్టర్ బోడపాటి సుబ్రహ్మ ణ్యేశ్వరరావు, జాతీయస్థాయి డాక్టర్ వీరబ్రహ్మయ్య, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ పి సత్యకుమారి, పశువైద్యులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆక్రమణ నుంచి స్థలం కాపాడాలని వినతి

కంకిపాడు : తాడిగడప కార్మిక నగర్‌లోని బందరుకాలువ కట్ట ఇరిగేషన్ స్థలం పక్కన స్థలాన్ని కొందరు అక్రమ బదా రులు ఆక్రమించుకొని గొడవలు పడుతున్నారని వైయ స్సార్ తాడిగడప మున్సిపల్ సిపిఎం కమిటీ నాయకులు అన్నారు. తమను ఎంఎల్ఎ ఇళ్ల కట్టుకోమన్నారని కొందరు వ్యక్తిగ తంగా ఎవరికి వారు స్థలాన్ని ఆక్రమించుకుంటున్నారన్నారు. వైయస్సార్ తాడిగడప మున్సిపల్ కమిషనర్, పెనమలూరు తహసీల్దార్, ఇరిగేషన్ అధికారులు స్పందించి ఆ స్థలాన్ని ప్రజలకు ఉపయోగపడే విధంగా రక్షించాలని కోరారు.

వెనిగండ్ల రాము ప్రత్యేక పూజలు

ప్రజాశక్తి-గుడివాడరూరల్: గుడివాడ మండలం బొమ్ములూరులో వేంచేసి ఉన్న శ్రీ సోమేశ్వర స్వామి ఆలయంలో గురువారం తెదేపా నాయకులు వెనిగండ్ల రాము ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వేద పండితులు ఆయనను వేదమంత్రోచ్ఛరణలతో శీర్వదించారు. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని రాము స్వామి వారికి విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు కడియాల గణేష్ ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని రాము ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తూర్పు కృష్ణా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ, కడియాల గణేష్, నవీన్, నాగరాజు, బుజ్జి, గ్రామస్థులు పాల్గొన్నారు.




రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన తహశీల్దార్, రెడ్ క్రాస్ సొసైటీ సభ్యులు

రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో అవనిగడ్డ తాసిల్దార్ కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించింది. ఈ శిబిరాన్ని మండల రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు తాసిల్దార్ ఎల్‌విఎస్ రామకృష్ణ ప్రారం భించారు. మొత్తం 30 మంది యువతీ యువ కులు రక్తదానం చేశారు. డాక్టర్ పట్టాభి రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంక్ డాక్టర్ హనుమంతయ్య సాంకేతిక సిబ్బంది ద్వారా రక్త సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో అవనిగడ్డ రెడ్ క్రాస్ సొసైటీ జీవితకాలపు సభ్యులు కోడూరు శ్రీనివాసరావు, గరికపాటి హరిప్రసాద్, తుంగల వెంకటగిరి పాల్గొన్నారు

శ్రీనివాసరావు కుటుంబసభ్యులకు పరామర్శ

ప్రజాశక్తి-పెదపారుపూడి : మండలంలోని యలమర్రు గ్రామ పార్టీ అధ్యక్షులు నగుళ్ళ శ్రీనివాసరావు తండ్రి పెద్దకర్మ కార్యక్రమంలో పామర్రు నియోజకవర్గం టీడీపీ ఇంచార్జ్ వర్ల కుమార్ రాజా గురువారం పాల్గొని వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. మండల పార్టీ అధ్యక్షులు చలసాని రమేష్ చౌదరి (వంటి) , మండల కార్యదర్శి మసిముక్కు రాంబాబు గుండపునేని శ్రీనివాసరావు (స్వామి),చెరుకూరి రమేష్ ,కాటం రాజేష్ పాల్గొన్నారు.



ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు : సిఐ

ప్రజాశక్తి-అవనిగడ్డ : కళాశాలలో ఎవరైనా విద్యార్థులు ర్యాగింగ్ పాల్పడితే కఠిన చర్యలకు గురికావాల్సి వస్తుందని అవనిగడ్డ సిఐ ఎల్ రమేష్ హెచ్చరించారు. గురువారం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ర్యాగింగ్ నిరోధక చట్టాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ డి ఉమారాణి అధ్యక్ష త నజరిగిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న సిఐ మాట్లాడుతూ విద్యార్థులు ర్యాగింగ్ కి దూరంగా ఉండాలని, స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని, సౌభ్రాతత్వం భావనతో కలిసిమెలిసి అభ్యసన సాగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వివిధ విభాగాల్లో విజేతలను సిఐ అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఆర్ అంకారావు, యాంటీ ర్యాగింగ్ కమిటీ కన్వీనర్ ఏ వీర కుమారి, అధ్యాపకులు పాల్గొన్నారు



వివిధ విభాగాలలో విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న సిఐ

ఇన్సూరెన్స్ చెక్ అందజేత



ఇన్సూరెన్స్ చెక్ అందిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-మచిలీపట్నంరూరల్ : మచిలీపట్నం మండలం చిన్నాపురం పంచాయతీ వెంకటాపురం గ్రామ జనసైనికుడు పలగాని శ్రీనివాసరావు ఇటీవల ప్రమాదం బారిన పడి కాలు విరిగి చికిత్స పొందుతున్నారు. జనసేన పార్టీ క్రియాశీలక సభ్యత్వం కలిగి ఉండుట చేత గాయాల పాలైన శ్రీనివాసరావు కి గురువారం 50వేల రూపాయలు పాలసీ మంజూరు కాగా ఆపార్టీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు బండ్రెడ్డి రామకష్ణ,మచిలీపట్నం ఇన్చార్జి బండి రామకష్ణ, ఇన్సూరెన్స్ పాలసీ50 వేలరూ చెక్కును బాధితునికి అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు, పెదయాదర సర్పంచ్ గల్లాతిమోతి, నెలకుర్రుసర్పంచ్ బొమ్మసాని నరేష్, జనసేన పార్టీ నగర అధ్యక్షుడు గడ్డంరాజు పాల్గొన్నారు.

చికెన్ ధరలు పతనం

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం పట్టణంలో మొన్నామొన్నటి దాకా కొండ దిగని కోడి మాంసం ధరలు పది రోజుల నుంచి తగ్గుతూ వస్తున్నాయి. కార్తీక మాసం ప్రారంభమవ్వడంతో చికెన్ ధర మరింత తగ్గాయని వ్యాపారులు అంటున్నారు. 20 రోజుల క్రితం రూ.250 పైన ఉన్న ధర వారం రోజుల నుంచి క్రమేపీ తగ్గుతూ వస్తుంది. ప్రస్తుతం స్కిన్ లెస్ రూ. 170, విత్ స్కిన్ కిలో రూ. 150 వచ్చింది. గన్నవరం మార్కెట్లో 30 చికెన్ దుకాణాలు ఉన్నాయి. వాటిల్లో వ్యాపారాలు తగ్గడంతో వ్యాపారులు ఉపాధి తగ్గుతుందని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ఎండల తగ్గి వాతావరణం చల్లబడటంతోపాటు స్వాముల మాలలు వేసే వారి సంఖ్య పెరగడంతో చికెన్ కొనుగోలు బాగా పడిపోయిందని వ్యాపారులు తెలిపారు. గత నెలలో కిలో స్కిన్ లెస్ చికెన్ రూ. 300 పైగా పలికింది. దీంతో సామాన్యులు చికెన్ తినాలంటే జంకే పరిస్థితి ఉండేది. ప్రస్తుతం కొండ దిగి వస్తుండడంతో పేద, మధ్య తరగతి ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోడిగుడ్డుదీ అదే దారి : కోడిగుడ్డు ధరలు పది రోజులుగా తగ్గుముఖం పట్టాయి. వంద కోడిగుడ్లు అక్టోబర్లో .555 ఉండగా, నవంబర్ 580 లో ధర పలికింది. ప్రస్తుతం వ్యాపారులు ఒకటి రూ.6 నుంచి అమ్ముతున్నారు.

గిట్టుబాటు కావడం లేదు
ప్రసాద్ రెడ్డి, కోళ్ల రైతు

కోళ్ల రైతులకు ప్రస్తుత ధరలు గిట్టుబాటు కావటం లేదు. పిల్ల రేటు, ఫీడ్ రేటు పెరిగిపోయింది. మరో పక్క ట్రాన్స్పోర్టు చార్జీలు, లేబర్ చార్జీలు పెరిగిపోయాయి. చికెన్ ధరలు భారీగా పడిపోవడంతో తీవ్ర నష్టాలు చవిచూస్తున్నాం. ప్రభుత్వం చికెన్ వ్యాపారులను ఆదుకోవాలి.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన

ప్రజాశక్తి-ఉయ్యూరు : విద్యతోపాటు వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యత ఎంతో అవసరమని న్యాయవాది ఎండి రియాజ్ అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు చేవూరి రవిసుధాకర్ ఆధ్వర్యంలో ఆకునూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు గురువారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈకార్యక్రమంలో రియాజ్ ముఖ్య వక్తగా పాల్గొని విలువలతో కూడిన విద్య సమాజానికి అవసరం, విద్యార్థులకు వ్యక్తి బిత్వ వికాసంపై అవగాహన కల్పించారు. వ్యక్తిత్వం పెంపొందించుకునే విధానం తెలియ జేశారు. ఈసందర్భంగా నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు సంస్థ చైర్మన్ కొలసాని రవికుమార్ బహుమతులు అందజేశారు. పినమల నాగకుమార్, మా నవత సభ్యులు మహంకాళి పవన్ ఫణి కుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.



గణపతిస్వామి మందిరం వద్ద హోమం

ప్రజాశక్తి - వన్‌టౌన్ : సంకట హర చతుర్థి సందర్భంగా గురువారం శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై చిన్న రాజగోపురం వద్ద ఉన్న లక్ష్మీ గణపతి స్వామి వారి మందిరం వద్ద వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ఆలయ వైదిక సిబ్బందిచే శాస్త్రోక్తంగా గణపతి స్వామి వారికి అభిషేకం, పూజ మరియు గణపతి మంత్రము హవనం (హోమం)ను వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి కె.ఎస్. రామరావు, వైదిక సిబ్బంది, ఆలయ అర్చకులు, సిబ్బంది మరియు భక్తులు పాల్గొన్నారు. అమ్మవారి దర్శనార్థం విచ్చేసిన భక్తులు హోమంను విశేషంగా తిలకించారు.

పౌరహక్కులపై అవగాహన

ప్రజాశక్తి-ఉంగుటూరు : పౌర హక్కులపై గ్రామ ప్రజలు అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీవో శేష గిరిరావు అన్నారు. మండలంలోని ఆత్కూరు గ్రామంలో గురువారం పౌర హక్కులపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో పాల్గొన్న శేషగిరిరావు మాట్లాడుతూ గ్రామాల్లో అంటరానితనం వంటి అమానుషమైన చర్యలకు పాల్పడే వ్యక్తుల పట్ల చట్టపరమైన చర్యలు ఉంటాయని, ప్రతిఒక్కరూ స్వేచ్ఛ సమానత్వం సోదర భావం కలిగి ఉండాలని అన్నారు ఈ కార్యక్రమంలో తహసిల్దార్ దోనవల్లి వనజాక్షి, పంచాయతీ కార్యదర్శి సాయిబాబు వీఆర్వో సునీల్ సిబ్బంది పాల్గొన్నారు.

కరపత్రాలు పంపిణీ

ప్రజాశక్తి - రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండలం సీతారాంపురంలో జరిగిన బాబు షష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి వారికి తెలుగుదేశం మేనిఫెస్టోలో ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలను, తెలుగుదేశం జనసేన ప్రభుత్వం వస్తే కలిగే లబ్ధిని వివరిస్తూ కరపత్రాలు పంచారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ముప్పిడి నాగేశ్వరరెడ్డి స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పేదలకు పక్కా ఇళ్లు, ఉపాధి కల్పించాలి : సిపిఎం


పేదలతో మాట్లాడుతున్న బోయి సత్యబాబు

ప్రజాశక్తి-వన్‌టౌన్: పశ్చిమ నియోజకవర్గంలోని 35వ డివిజన్ పూర్ణానందంపేట పాత ఆంధ్రప్రభ కార్యాలయం వద్ద, ఇరిగేషన్ డిపార్ట్మెంట్ స్థలంలో గత 50 సంవత్సరాలుగా నివాసం ఉంటూ, చెక్కపెట్టెలు చేసే వంద కార్మిక కుటుంబాలకు చెందిన ఇళ్లకు ఇళ్ల పట్టాలు ఇస్తామని, పక్కా ఇళ్లు నిర్మాణం చేస్తామని, చేసుకునేందుకు షాపులు నిర్మాణం చేస్తామని అధికారానికి రాకముందు ఓట్లు వేయించుకొని అధికారం వచ్చిన తర్వాత మోసగించడం పరిపాటిగా మారిందని సిపిఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి, 50వ డివిజన్ కార్పొరేటర్ బోయి సత్యబాబు తెలిపారు. గురువారం వారి ఇళ్ల తొలగింపు చేసేందుకు పోలీస్, కార్పొరేషన్ సిబ్బంది వచ్చి చెట్టు తొలగించే ప్రయత్నం ప్రారంభించడంతో స్థానిక పేదలు ఎదురు తిరిగి ఆందోళన చేపట్టడంతో తాత్కాలికంగా నిలుపుదల చేయడం జరిగింది. ఈ విషయం తెలిసిన వెంటనే సంఘటన ప్రదేశానికి సిపిఎం పశ్చిమ నగర కమిటీ కార్యదర్శి బోయి సత్యబాబు కార్యకర్తల బందంతో స్థానిక ప్రజలను కలిసి వారికి అండగా ఉంటామని తెలియచేశారు. విలువైన భూములను నుండి పేదలను ఖాళీ చేసి బడా బాబులకి కట్టబెట్టేందుకు వైసిపి ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. ఈ ప్రభుత్వ స్థలంలో ఉన్న పేదలకు పట్టాలివ్వకుండా, పక్కా ఇల్లు నిర్మాణం చేయకుండా వారి యొక్క ఉపాధికి షాపులు నిర్మించకుండా మోసగిస్తున్నారని తెలిపారు. పేదల తరుపున పెత్తందారులపై యుద్ధం అనే ముఖ్యమంత్రి ప్రకటనలు వచ్చి బూటకమని, ఈ పేదల యొక్క పరిస్థితి అర్థం పడుతుందన్నారు. మరుగుదొడ్ల సదుపాయం లేదన్నారు. మరుగుదొడ్ల కన్నా చిన్న ఇంటి స్థలంలో దోమల కాటుకు గురవుతున్నారని, వెంటనే ఇళ్ల పట్టాలు ఇచ్చి ఇళ్లు నిర్మాణం చేసి వారి జీవన ఉపాధికి షాపులు నిర్మించి న్యాయం చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తున్నట్లు సత్యబాబు తెలిపారు. లేని యెడల బాధితుల తరుపున పోరాటం చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ఈ పర్యటనలో సిపిఎం నాయకులు హనుమంతరావు, సాంబశివయ్య, సూర్యం పాల్గొన్నారు.

రోడ్డు ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-వన్‌టౌన్: విజయవాడ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో రోడ్డుపై వ్యాపారాలు చేస్తూ, ఆక్రమణలకు పాల్పడుతున్న వారి పట్ల కఠిన చర్యలు తప్పవని సిఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. గురువారం టూటౌన్ సిఐ సుబ్రహ్మణ్యం తన సిబ్బందితో చిట్టినగర్ సెంటర్ నుండి బిఆర్‌టిఎస్ రోడ్డు వరకూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించే ఆక్రమణదారుల యొక్క వస్తువులను తొలగింపు చర్యలు చేపట్టారు. రోడ్డుపై వ్యాపారం నిర్వహించేవారు ఎవరూ కూడా రోడ్డును ఆక్రమించి ప్రజలకు ఇబ్బందులు కలిగించే విధంగా వ్యవహరిస్తున్న వారిని కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎవరు కూడా తమ సామానులు రోడ్డు మీద పెట్టకుండా వారి దుకాణాల లోపల పెట్టకొని వ్యాపారాలు నిర్వహించుకోవాలని, ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చూడాలని సిఐ సుబ్రహ్మణ్యం కోరారు లేదంటే వారిపై కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు.


వ్యాపారులతో మాట్లాడుతున్న సిఐ

9న ఎలక్ట్రానిక్ సామాన్ల వేలం

ప్రజాశక్తి-విజయవాడ: విజయవాడ గాంధీ నగర్‌లోని జిల్లా కారాగారంలో నిరుపయోగంగా ఉన్న పాత ఎలక్ట్రానిక్ సామాన్లు ఈ నెల 9వ తేదీన బహిరంగ వేలం వేయనున్నట్లు కర్మాగార పర్యవేక్షణ అధికారి హంసపాల్ ఒక ప్రకటనలో తెలిపారు.కారాగారానికి చెందిన పాతవి రెండు టైర్స్ (టాటా ఇన్నోవా) ఒక బ్యాటరి (టాటా ఇన్నోవా)ను బహిరంగ వేలం వేయుటకు నిర్ణయించడం జరిగిందన్నారు. వేలంలో పాల్గొనుటకు ఆసక్తిగల వాటాదారులు 500 రూపాయల ధరావత్తు సొమ్మును చెల్లించి బహిరంగ వేలంలో పాల్గొన వచ్చునన్నారు. ఎక్కువ మొత్తానికి పాడుకుని నెగ్గిన పాటదారుడు మొత్తం సొమ్మును 18 శాతం జిఎస్‌టితో కలిపి చెల్లించి వస్తువులను స్వాధీనపరచుకోవచ్చున్నారు. బహిరంగ వేలంలో నెగ్గని పాటదారులకు తరువాత సొమ్ము తిరిగి చెల్లిస్తామన్నారు. వేలానికి సంబంధించి ఇతర వివరాలకు 94946 32700, ల్యాండ్ లైన్ నెంబర్ 0866-2574236 నందు సంప్రదించాలని పర్యవేక్షణ అధికారి హంసపాల్ ఆ పకటనలో తెలిపారు.

3న వికలాంగుల దినోత్సవం

ప్రజాశక్తి-విజయవాడ: ఈ నెల 3వ తేదీన జిల్లాస్థాయి విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని స్థానిక తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల హిజ్రాల మరియు వయో వృద్ధుల సహాయ సంచాలకులు వి.కామరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 3వ తేదిన కృష్ణా, ఎన్‌టిఆర్ జిల్లాలకు సంబంధించి జిల్లా స్థాయి విభిన్న ప్రతిభావంతుల దినోత్సవాన్ని నిర్వహించనున్నామన్నారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు, శాసన మండలి సభ్యులు, శాసనసభ్యులు, జిల్లా స్థాయి ఉన్నతాధికారులు పాల్గొనడం జరుగుతుందన్నారు. జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులు, స్వచ్ఛంద సంస్థల ద్వారా ప్రత్యేక పాఠశాలలో చదువుతున్న వికలాంగులు, విభిన్న ప్రతిభావంతులకై పనిచేస్తున్న వివిధ సంఘాలు కార్యక్రమంలో పాల్గొన్ని విజయవంతం చేయాలని కోరారు.

'క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి'

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారు "ఆడుదాం ఆంధ్రా" ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ప్రతిభ ఉన్న క్రీడాకారులను వెలుగులోకి తీసుకొచ్చేందుకు శ్రీకారం చుట్టారు. అలాగే జగ్గయ్యపేట పురపాలక సంఘ పరిధిలో కూడా క్రీడలు నిర్వహించుటకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కో-కో, కబడ్డీ మరియు పోటీలేని ఆటలు(యోగ, టెన్నీకోయిట్, 2కె లేదా 3 కె మారథాన్) సంబందించి పూర్తి వివరములు వార్డు సచివాలయాలతో పాటు ఆన్‌లైన్ పోర్టల్, టోల్ ఫ్రీ నెంబరు 1902 ద్వారా రిజిస్ట్రేషన్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించింది. పట్టణ స్థాయిలో పోటీలు 15 డిసెంబర్‌న మొదలై రాష్ట్రస్థాయి పోటీలు 24 జనవరి,2024 లోపు ముగుస్తాయి. క్రీడాకారులు డిసెంబర్ 13లోపు రిజిస్ట్రేషన్ చెసుకోవాలని కమిషనర్ సిహెచ్.నాగమల్లేశ్వరరావు తెలిపారు.

పాత రాజరాజేశ్వరిపేటలో పోతిన పర్యటన

ప్రజాశక్తి-వన్‌టౌన్: ఇంటింటికి రాబోయే మన జనసేన, టిడిపి ప్రభుత్వ కార్యక్రమంలో భాగంగా 56వ డివిజన్ అధ్యక్షులు పిళ్ళా వంశి మరియు డివిజన్ సమన్వయకర్తలు దాసిన జగదీష్ మాచర్ల పవన్ కళ్యాణ్, సయ్యద్ షాహినా హుస్సేన్ ఆధ్వర్యంలో 64 వ రోజు గురువారం పశ్చిమ నియోజకవర్గం ఇన్ఛార్జి పోతిన మహేష్ 56వ డివిజన్‌లోని పాత రాజరాజేశ్వరి ఎస్ఎస్ స్కూల్ వద్ద నుంచి తదితర ప్రాంతంలో పర్యటించి, ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మీడియాతో మాట్లాడుతూ పాత రాజరాజేశ్వరిపేట సమస్యల నిలయంగా ఉందని, రోజువారీ పనులు చేసుకుంటూ అదే విధంగా చిన్న ఉద్యోగాలు చేసుకుంటూ జీవనం సాగించే ఇక్కడి ప్రజల్ని వైసిపి పార్టీ మోసం చేశారని తెలిపారు. ఇచ్చిన హామీలలో ఒక్క హామీ కూడా నెరవేర్చలేదన్నారు. ఈ కార్యక్రమంలో పిళ్ళా వంశీ, డివిజన్ సమన్వయకర్తలు దాసిన జగదీష్, మాచర్ల పవన్ కళ్యాణ్, సయ్యద్ షాహినా, హుస్సేన్, అశోక్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



గాంధీనాగరాజన్ దీక్ష

ప్రజాశక్తి-వన్‌టౌన్: మహాత్ముని ఆశయాలు నెరవేరితేనే నిజమైన ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుందని గాంధీ దేశం సోషల్ వెల్ఫేర్ ట్రస్ట్ అధ్యక్షులు గాంధీ నాగరాజన్ అన్నారు. గురువారం ఊర్మిళానగర్‌లోని ట్రస్ట్ కార్యాలయంలో మహాత్మా గాంధీని గాడ్సే హత్య చేసిన జనవరి 30వ తేదీని పురస్కరించుకొని ప్రతి నెల 30వ తేదీ చేస్తున్న రీతిలోనే కళ్లకు గంతలు కట్టుకుని ఆయన సత్యాగ్రహ నిరాహారదీక్ష చేశారు. ఈ సందర్భంగా గాంధీ నాగరాజన్ మీడియాతో మాట్లాడుతు తాను ప్రతి నెల 30వ తేదీన కళ్లకు గంతలు కట్టేది గాంధీ మహాత్ముడి కలలను నిజం చేసేందుకేనని అన్నారు. స్వాతంత్ర్యం కోసం పాటుపడిన జాతిపిత మహాత్మాగాంధీ, బాబాసాహెబ్ అంబేద్కర్‌ల కఠోర శ్రమను, ప్రజాస్వామ్య విలువలను ప్రజలు పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. ఓటు విలువను అందరూ గుర్తించాలని, కులం పేరుతో, మతం పేరుతో, డబ్బుకు, మందుకు, ఉచితాలకు లొంగిపోయి అమూల్యమైన ఓటును స్వార్థపరులకు వేయకూడదని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో గాంధీదేశం ట్రస్ట్ మహిళా అధ్యక్షురాలు ఆర్ఎన్.శివరంజని, ట్రస్ట్ ఏపీ అధ్యక్షురాలు బి. భారతి తదితరులు పాల్గొన్నారు.

3న ఎన్ఎంఎంఎస్ పరీక్ష

ప్రజాశక్తి-ఎడ్యుకేషన్

2023-24 సంవత్సరానికి సంబంధించి నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్స్ స్కీమ్ (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఈ నెల 3వ తేదీన జరగనుందని.. పరీక్ష నిర్వహణకు ఏర్పాట్లను పూర్తిచేసినట్లు ఎన్‌టీఆర్ జిల్లా డీఈవో సీవీ రేణుక గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరగనుందన్నారు. జిల్లాలో జెడ్‌పీ హైస్కూల్ (నందిగామ), శ్రీవిద్యా హైస్కూల్ (రైతుపేట, నందిగామ), శ్రీచైతన్య హైస్కూల్ (రైతుపేట, నందిగామ), నారాయణ ఈఎం హైస్కూల్ (రైతుపేట, నందిగామ), రవీంద్రభారతి ఈఎం హైస్కూల్ (నందిగామ), జెడ్‌పీ గర్ల్స్ హైస్కూల్ (నడిమి, తిరువూరు), గవర్నమెంటు హైస్కూల్ (తిరువూరు), శ్రీనిధి టెక్నో హైస్కూల్ (తిరువూరు), కేబీసీ జెడ్‌పీ బాలుర హైస్కూల్ (పటమట, విజయవాడ), కేఎస్ఆర్‌జెడ్‌పీ గర్ల్స్ హైస్కూల్ (పటమటలంక, విజయవాడ), బీఎస్ఆర్‌కేఎంసీ హైస్కూల్ (ఎంజీ పురం, విజయవాడ), ఏకేటీపీఎంసీ హైస్కూల్ (ఎస్ఎన్ పురం, విజయవాడ), ఎంకే బైగ్ మెక్ ఎంసీ హైస్కూల్ (ఎఎస్‌నగర్, విజయవాడ), గాంధీజీ ఎంపీఎల్ హైస్కూల్ (వన్‌టౌన్, విజయవాడ), బిషప్ అజరయ్య హైస్కూల్ (విజయవాడ)లో పరీక్ష జరగనున్నట్లు డీఈవో రేణుక వెల్లడించారు.

ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ ప్రారంభం



ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ వ్యాపార విస్తరణలో భాగంగా ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తాజాగా విజయవాడలో అడుగుపెట్టింది. నగరంలోని పోస్టల్ కాలనీ వద్ద నూతన శాఖను ప్రారంభించారు. మాజీ మేయర్ కోనేరు శ్రీధర్ గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్ ఇట్టిరా డేవిస్ మాట్లాడుతూ విజయవాడ లో ప్రారంభం చేసిన శాఖలతో మొత్తం శాఖల సంఖ్య 700కి చేరుకుందన్నారు. బ్యాంకింగ్ సేవలను మరిన్ని రాష్ట్రాలకు విస్తరించాలనే ఉద్దేశంతో ఆంధ్ర లోని విజయవాడ లో అడుగుపెట్టినట్లు, దీంతో తన వ్యాపారాన్ని 26 రాష్ట్రాలకు విస్తరించినట్లు అయిందని తెలిపారు. ఈ శాఖల్లో పొదుపు, కరెంట్ ఖాతాలతోపాటు గహ, చిన్న సంస్థలకు రుణాలు ఇస్తున్నట్లు చెప్పారు. పొదుపు ఖాతాలపై 7.50 శాతం వార్షిక వడ్డీని ఆఫర్ చేస్తున్న బ్యాంక్..560 రోజుల కాలపరిమితి కలిగిన ఫిక్స్‌డ్ డిపాజిట్లపై 8.75 శాతం వడ్డీని ఆఫర్ చేస్తుందన్నారు. సూక్ష్మ, చిన్నస్థాయి సంస్థలకు రూ.10 లక్షల నుంచి రూ.10 కోట్ల వరకు, రూ.5 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు గృహ రుణాలు అందిస్తున్నట్లు చెప్పారు. రాబోయే రోజుల్లో రాజమండ్రి, విశాఖపట్నం తమ శాఖలను విస్తరించనున్నట్లు ఆయన ప్రకటించారు. చీఫ్ బిజినెస్ ఆఫీసర్ కరోల్ ఫుర్తాడో మాట్లాడుతూ ఏపీలో ఉజ్జీవన్ స్మాల్ ఫైనాన్స్ సేవలు ముందు కు తీసుకెళ్తామని అన్నారు. సేవింగ్స్ అండ్ ప్రివిలేజ్ సేవింగ్స్ ఖాతా ఉన్నాయని, ఇది ఏడాది 7.5 వడ్డీ రేటు అందిస్తుందన్నారు. ఏ బ్యాంక్ ఏటీఎం వద్దనైనా అపరిమిత ఉచిత లావాదేవీలు, నెట్ బ్యాంకింగ్, మొబైల్ బ్యాంకింగ్ ద్వారా జరపొచ్చన్నారు. సీనియర్ సిటిజన్ ఖాతా, మహిళ గరిమా ఖాతా, ఎన్నారై ఖాతా, సొల్యూషన్స్ ఖాతాలు ఉన్నాయని తెలిపారు. సీనియర్ సిటిజన్, వికలాంగులకు డోర్ స్టెప్ బ్యాంకింగ్ సేవలు అందిస్తున్న మని అన్నారు. ఈ సమావేశంలో చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ లక్ష్మణ్ వెలయుతం, చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ రమేష్ మూర్తి, ఏపీ, తెలంగాణ హెడ్ సత్యంద్రన్ తదితరులు పాల్గొన్నారు.